


ప్రజా చైతన్యమే...

# లక్ష్యం

తెలుగు దినపత్రిక




ఎడిటర్ ఇన్ చీఫ్-మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010

Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.

సంపుటి:1 సంచిక:228 శనివారం, 11-10-2025 పేజీలు : 8 వెల: 3/-

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

## పోర్టులు... ఎయిర్ పోర్టులతో

# సర్వతోముఖాభివృద్ధి

- ఇథనాల్ ప్లాంట్లతో పర్యావరణానికి మేలు
- పశు పోషణతో పాడి రైతులకు ఆర్థికాభివృద్ధి
- విశ్వసముద్ర గ్రూప్ కు చెందిన వివిధ ప్రాజెక్టులు ప్రారంభించిన







**నెల్లూరు, అక్టోబర్ 10:(లక్ష్యం న్యూస్)**

పోర్టులు, ఎయిర్ పోర్టులతో రాష్ట్రం ఆర్థికాభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని ఈదగాలి గ్రామంలో విశ్వసముద్ర గ్రూపునకు చెందిన వివిధ ప్రాజెక్టులను శుక్రవారం సీఎం ప్రారంభించారు. ఇథనాల్ ప్లాంట్, నంద గోకులం లైఫ్ స్కూల్, సేవ్ ద బుల్, పవర్ ఆఫ్ బుల్ ప్రాజెక్టులను సీఎం ప్రారంభించి.. పరిశీలించారు. నంద గోకులం లైఫ్ స్కూల్ విద్యార్థులతో చంద్రబాబు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."నెల్లూరు జిల్లాలో ఇప్పుడు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులతో పాటు.. కీలక పరిశ్రమలు వచ్చాయి. కృష్ణపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులు జిల్లా అభివృద్ధికి కీలకంగా మారతాయి. దగదర్తి విమానాశ్రయం త్వరలోనే వస్తుంది. బీపీసీఎల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ , క్రిబ్ కో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ కూడా రాబోతున్నాయి. రాష్ట్ర ప్రగతిలో.. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో నెల్లూరు జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. ఇదే సమయంలో జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం లేదు. సోమశిల, కండలేరు లాంటి మంచి ప్రాజెక్టులు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. 150 టీఎంసీల నీళ్లు ఈ రెండు ప్రాజెక్టుల్లో ఉంటాయి. భవిష్యత్తులో నీటి కొరత లేకుండా ఈ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉంచుతాం." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఆర్థికాభివృద్ధికి తొడ్పడాలి... పర్యావరణం బాగుండాలి**

"ఏ ప్రాజెక్టులు చేపట్టినా... రాష్ట్రానికి ఆర్థికంగా ఉపయోగ పడడంతోపాటు... పర్యావరణ హితంగా ఉండాలి. ఈ దిశగానే విశ్వసముద్ర మూడు ప్రాజెక్టులు చేపట్టింది. 24 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఎథనాల్ ప్లాంట్ రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్ ఉత్పత్తి చేస్తోంది. దీని కోసం 15 వేల టన్నులకు పైగా పాడైన బియ్యం, నూకలు, పంట వ్యర్థాల కొనుగోలు చేస్తోంది. దీని వల్ల రైతులకు మేలు జరుగుతోంది. రైతుల సంక్షేమంతో పాటు ఇథనాల్ తయారు చేస్తూ విశ్వసముద్ర యాజమాన్యం దేశ ప్రగతికి తోడ్పడుతోంది. అలాగే పశు సంపదను కాపాడేందుకు కొత్త ప్రయోగం చేయటం అభినందనీయం. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన గోవులను సంరక్షిస్తున్నారు. ఒంగోలు జాతి పశువులను సంరంక్షిచడంపై ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేయడమే కాకుండా.. శాస్త్రీయ పద్దతుల్లో పునరుత్పత్తికి చింతా శశిధర్ ఫౌండేషన్ పని చేస్తోంది. పవర్ ఆఫ్ బుల్ అనే విధానంలో విద్యుత్పత్తి చేపట్టడం వినూత్న ప్రక్రియ. ఈ విధానం ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 5 కిలోవాట్లను ఇన్ హౌస్ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఇక నంద గోకులం లైఫ్ స్కూల్ ద్వారా ప్రతిభ కలిగిన, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉత్తమ విద్యను అందిస్తున్నారు. సమాజానికి తిరిగి ఇవ్వటం అనే విధానంలో భాగమే పీ4. డబ్బులు ఇవ్వటం ఒక్కటే కాదు చేయూత ఇవ్వడమనేది పీ4 విధానంలో ముఖ్యమైన అంశం." అని ముఖ్యమంత్రి వివరించారు.

**భవిష్యత్తులో భారీ పెట్టుబడులు**

"విశాఖకు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నాం. రూ.88 వేల కోట్లతో ఓ దేశచరిత్రలోనే అతిపెద్ద పెట్టుబడిగా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కు ఆల్గారిథమ్స్ కూడా రాసేలా మన పిల్లలు సిద్ధం అవుతున్నారు. 2047కి భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తయారవుతుంది. ఏపీ దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఉంటుంది" అని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదా మస్తాన్ రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు హాజరయ్యారు.

## ప్రచారాలు కాదు,

# చిత్తశుద్ధే ముఖ్యం





**(ఢిల్లీ,నుంచి )**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతోకాలంగా ఆశిస్తున్న నోబెల్ శాంతి బహుమతి ఈసారి కూడా ఆయనకు అందని ఆశ గానే మిగిలింది. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ చేసిన ప్రచారంతో సహా, అనేక వివాదాస్పద వాదనలతో ఈ పురస్కారం కోసం తీవ్రంగా ప్రయత్నించిన ట్రంప్‌కు నిరాశే ఎదురైంది. 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతిని వెనిజులాకు చెందిన విపక్ష నేత, ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడోకు అందిస్తున్నట్లు నోబెల్ కమిటీ ప్రకటించింది.నోబెల్ బహుమతి ప్రకటన అనంతరం కమిటీ ఛైర్మన్ జార్గెన్ వాట్నే ఫ్రైడ్నెస్ మాట్లాడుతూ, తమ నిర్ణయం కేవలం గ్రహీతల ధైర్యసాహసాలు, చిత్తశుద్ధిపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. "ప్రతి ఏటా మాకు వేలాది సిఫార్సు లేఖలు వస్తాయి, మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారాలు జరుగుతాయి. కానీ మా నిర్ణయాలు ఆల్ఫ్రెడ్ నోబెల్ సంకల్పానికి అనుగుణంగానే ఉంటాయి" అని ఆయన తెలిపారు.

## భారత రాయబార కార్యాలయం కాబుల్‌లో ..

**(ఢిల్లీ,నుంచి )**

: ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వంలో తాత్కాలిక విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్న ఆమిర్‌ఖాన్ ముత్తాఖీతో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక భేటీ అయ్యారు. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో ఇరువురు నేతలు 2 దేశాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబుల్‌లో భారత రాయబార కార్యాలయం మళ్లీ తెరుస్తామని ఈ సందర్భంగా జైశంకర్ ప్రకటించారుఉగ్రవాదాన్ని ఏరివేసేందుకు 2 దేశాలు కలిసి పోరాటం చేస్తాయని ఇరుదేశ విదేశాంగ నేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌పై



పరోక్షంగా విమర్శలు గుప్పించిన జైశంకర్.. సీమాంతర ఉగ్రవాదం పెంచి పోషిస్తున్న కొన్ని దేశాలకు త్వరలోనే తగిన బుద్ధి చెబుతామని అన్నారు

## వైయస్ఆర్‌సీపీ

# బలోపేతానికి కృషి చేద్దాం





**నంద్యాల, అక్టోబర్ 10:(లక్ష్యం న్యూస్)**

ప్రతి పల్లెలోనూ వైయస్ఆర్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దామని వైయస్ఆర్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సంస్థాగత సమావేశానికి ముఖ్య అతిధులుగా రీజినల్-కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను విడుదల చేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రచ్చబండ కార్యక్రమంపై పార్టీ నేతలకు పెద్దిరెడ్డి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నంద్యాల పార్లమెంట్ పరిశీలకురాలు ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి రు, నంద్యాల మాజీ ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి , కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి , ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి , బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి ,నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్ప రవిరెడ్డి ,ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల నాని , నందికొట్కూరు ఇంచార్జి ధార సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ జగన్ పర్యటనకు

# వెల్లువలా తరలివచ్చిన జనం

**విశాఖపట్నం, అక్టోబర్ 10:(లక్ష్యం న్యూస్)**

నర్సీపట్నం మెడికల్ కాలేజీ సందర్శన కోసం వచ్చిన మాజీ సీఎం, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ పర్యటనకు అశేష జనవాహిని తరలి వచ్చిందని మాజీ మంత్రి, వైయస్ఆర్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. విశాఖ నుంచి నర్సీపట్నం మెడికల్ కాలేజీ వరకు 60 కి.మీ కాగా, అక్కడికి వెళ్లడానికి జగన్‌గారికి ఏకంగా 6 గంటల సమయం పట్టిందని ఆయన తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులతో పాటు, పలువురు ఆయన్ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారని, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కెకె రాజుతో కలిసి, విశాఖపట్నంలోని వైయస్ఆర్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ప్రెస్‌మీట్‌లో గుడివాడ అమర్‌నాథ్ ఇంకా ఏం మాట్లాడారంటే..: జగన్ గారికి ప్రజల పూర్తి సంఘీభావం: ఉమ్మడి విశాఖ జిల్లాలో వైయస్ జగన్ పర్యటనను విజయవంతం చేయడం ద్వారా కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆమోదించబోవడం లేదన్న విషయాన్ని ప్రజలు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. జగన్‌గారి




పర్యటనను విజయవంతం చేసిన ప్రజలు, కార్యకర్తలు, మేధావులకు మా ధన్యవాదాలు. రాష్ట్రంలో మెజారిటీ ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ, పేదవాడికి వైద్య విద్యను అందుబాటులో ఉంచాలి. అందుకే ప్రభుత్వం తన నిర్ణయంపై పునరాలోచించాలి.అన్ని ప్రాంతాల ప్రజలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్న లక్ష్యంతో, నాడు సీఎం శ్రీ వైయస్ జగన్ ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ దిశలో ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టి, వాటిలో 7 కాలేజీల పనులు పూర్తి చేశారు. వాటిలో 5 కాలేజీల్లో గత మూడేళ్లుగా అడ్మిషన్లు కూడా జరుగుతున్నాయి. కాగా, రాష్ట్రంలో 10 కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

## ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల

# సుదీర్ఘ ప్రస్థానానికి గౌరవం

**- రాష్ట్ర పురోగతికి శాశ్వత దిశానిర్దేశం చేసిన విజనరీ నాయకుడు సీఎం చంద్రబాబు గారు : మంత్రి అచ్చెన్నాయుడు**



**అమరావతి, అక్టోబర్ 10:(లక్ష్యం న్యూస్)**

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానం పూర్తయిన సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు గారు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ఆయన ఒక విజనరీ స్టేట్స్‌మన్, ఒక ప్రతిభావంతుడు శిల్పి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును ముందుగానే ఊహించి, ఆధునిక సాంకేతికతతో, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి విధానాలతో రాష్ట్రానికి దిశానిర్దేశం చేసిన గొప్ప నాయకుడు ఆయన. ఐటి రంగం ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపిన దార్శనికుడు, రైతుకు సాంకేతికతను చేరువ చేసిన సంస్కర్త, యువతకు అవకాశాల ద్వారాలు తెరిచిన మార్గదర్శి చంద్రబాబు గారు అని అన్నారు. ఏ రంగంలో చూసినా ఆయన దూరదృష్టి, కష్టపడే తీరు, పారదర్శక పాలనకు నిదర్శనం. స్మార్ట్ ఆంధ్రప్రదేశ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్, ఈ-గవర్నెన్స్, వాటర్ మేనేజ్‌మెంట్, ఫార్మ్ టు మార్కెట్ లింకేజెస్ వంటి అంశాలను అమలుచేసి రాష్ట్రాన్ని ఆధునిక దిశగా నడిపించారు. ఆయన కలల అమరావతి రాజధాని ఆలోచన, గ్రామ సచివాలయాల భావన, రైతుల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన పథకాలు, ప్రజా కేంద్రిత ఆలోచనలకు ప్రతీకలు అని మంత్రి అభిప్రాయపడ్డారు. చంద్రబాబు గారు నాయకత్వం వహించే ప్రతి కాలం, ప్రతి నిర్ణయం ప్రజల జీవితాల్లో ఒక సానుకూల మార్పును తీసుకువస్తుంది. ఆయనలో ఉన్న సూక్ష్మ దృష్టి, పట్టుదల, పరిపాలన నైపుణ్యం, ప్రజాసేవా తపన ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టాయి. దేశ స్థాయిలోనూ ఆయన చేసిన కృషి అనన్యసామాన్యం. అభివృద్ధి, నూతన ఆలోచనలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్న ఆయనకు ఈ రోజు మరొక మైలురాయి అని అన్నారు. ఆయన వంటి విజనరీ నాయకుడు మన రాష్ట్రానికి వరం. ఆయన పాలనలోనే ఆంధ్రప్రదేశ్ నిజమైన అర్థంలో సుజన పాలన, స్మార్ట్ రాష్ట్రం దిశగా పయనిస్తుంది అని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు మరెన్నో విజయాలు, సుదీర్ఘ ఆరోగ్యం లభించాలని, రాష్ట్ర ప్రజల సేవలో ఆయన తపన కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# 16న కర్నూలులో

## సూపర్ జిఎస్ టి -సూపర్ సేవింగ్స్ విజయోత్సవ సభ



- ప్రధాని మోడీతో పాటు సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రి లోకేష్ హాజరు
- జిఎస్ టి సేవింగ్స్ పై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు
- ఏర్పాట్ల పై ఉన్నతస్థాయి అధికారులతో మంత్రుల బృందం సమీక్ష

**అమరావతి,అక్టోబర్ 10:(లక్ష్యం న్యూస్)**

ఈనెల 16వతేదీన కర్నూలులో ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే సూపర్ జిఎస్ టి %-% సూపర్ సేవింగ్స్ సభను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ కోరారు. ప్రధాని రాష్ట్ర పర్యటన ఏర్పాట్లపై ఉండవల్లి నివాసంలో నిర్వహించిన మంత్రుల బృందం సమావేశానికి రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ముఖ్యమంత్రి కార్యాలయ సీనియర్ అధికారులు కార్తికేయ మిశ్రా, పీయూష్ కుమార్, అహమ్మద్ బాబు హాజరయ్యారు. ఈనెల 16వతేదీ ఉదయం ప్రధాని మోడీ సున్నిపెంట వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం ద్వారా శ్రీశైలం బయలుదేరి వెళతారు. అనంతరం శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. తర్వాత శ్రీశైలం నుంచి బయలుదేరి కర్నూలు సమీపంలోని నన్నూరు రంగమయూరి గ్రీన్ హిల్స్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సూపర్ జిఎస్ టి - సూపర్ సేవింగ్స్ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ నిర్వహించే సభలో ప్రధాని మోడీతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ ప్రసంగిస్తారు. సభానంతరం ప్రధాని మోడీ సాయంత్రం కర్నూలు సమీపాన గల ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకుని డిల్లీ బయలుదేరి వెళ్తారు. రాష్ట్రవ్యాప్తంగా సూపర్ జిఎస్ టి - సూపర్ సేవింగ్స్ పై పెద్దఎత్తున నిర్వహించిన ప్రచార, అవగాహన కార్యక్రమాల గురించి మంత్రుల బృందం చర్చించింది. ఈ సందర్భంగా అధికారులు స్పందిస్తూ... ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ 98,985 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వ్యాపార సంస్థలు, ఎంఎస్ఎంఈ, రైతు కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. సూపర్ జిఎస్ టి - సూపర్ సేవింగ్స్ పై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించామని అధికారులు తెలిపారు. నూతన జిఎస్ టి విధానంవల్ల కలిగే లబ్ధిపై రాష్ట్రవ్యాప్తంగా హాస్పటల్స్ లో 22,500 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... నూతన జిఎస్ టి అమలులోకి వచ్చాక రాష్ట్రంలో ఆటోమొబైల్ సేల్స్ గణనీయంగా పెరిగాయని, ఈ పెరుగుదల 33శాతానికి పైగా ఉందని చెప్పారు. లగ్జరీ కార్లకు సైతం సెస్సును తొలగించడం వల్ల ఆ విభాగంలో కూడా అమ్మకాలు ఆశాజనకంగా నమోదవుతు న్నాయని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 16నుంచి 19 తేదీ వరకు జిల్లా కేంద్రాల్లో గ్రాండ్ జిఎస్టి షాపింగ్ ఫెస్టివల్స్ ఏర్పాటు చెయ్యాలని అధికారులను మంత్రుల బృందం కోరింది.

# సంపాదకీయం

## మరి తమిళనాడులో

### 69% రిజర్వేషన్లు ఎలా

**తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ఆపసోపాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. న్యాయస్థానాల ముందు ఈ విషయంలో పోరాడాల్సిన పరిస్థితి ఉంది. ఇందుకు కారణం, ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రధానమైనది. రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలు లేదు అని ఆ కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పు, తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న 42 శాతం రిజర్వేషన్ల అమలును మోకాలొడ్డుతోంది. అయితే, తమిళనాడు రాష్ట్రంలో మాత్రం 50 శాతం మించి రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. 1. తమిళనాడులో ప్రస్తుతం 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:2. వెనుకబడిన తరగతులు 30%(దీనిలో బీసీ ముస్లింలకు 3.5% అంతర్గత రిజర్వేషన్ ఉంది)3. అత్యంత వెనుకబడిన తరగతులు/డీనోటిఫైడ్ కమ్యూనిటీలు - 20%4. షెడ్యూల్డ్ కులాలు - 18%షెడ్యూల్డ్ తెగలు - 1% మొత్తం రిజర్వేషన్లు - 69%తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ల అమలు వెనుక సుదీర్ఘమైన చరిత్ర ఉంది. అక్కడి సామాజిక న్యాయ పోరాటం, అక్కడి రాజకీయ నేతలలో ఉన్న సంకల్పం, చట్టపరమైన వ్యూహాలను వారు అనుసరించడం వల్ల 50 శాతం మించి రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యమైంది. ఈ పూర్వాపరాల్లోకి వెళితే, తమిళనాడుపై ద్రవిడ ఉద్యమ ప్రభావం అంతా ఇంతా కాదు. ఈ రిజర్వేషన్ల డిమాండ్ చరిత్ర 1920ల నుంచి ఉంది. దీని లక్ష్యం ఒక్కటే: బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అధిక ప్రాధాన్యత కల్పించడం.భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మద్రాస్ రాష్ట్రంలో రిజర్వేషన్లు క్రమక్రమంగా పెరగడం ప్రారంభించాయి. 1971ల నాటికి అప్పటి డీఎంకే ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 25 శాతం నుంచి ఒక్కసారిగా 31 శాతానికి పెంచింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు 16 నుంచి 18 శాతానికి పెంచింది. దీంతో 1971ల నాటికి తమిళనాడు రాష్ట్రంలో రిజర్వేషన్లు 49 శాతానికి చేరాయి. ఆ తర్వాత 1980ల నాటికి ఎంజీ రామచంద్రన్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 31 శాతం నుంచి 50 శాతానికి పెంచడం జరిగింది. దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీల మొత్తం రిజర్వేషన్ల శాతం 68 శాతానికి చేరింది. ఆ తర్వాత 1989లో డీఎంకే ప్రభుత్వం గిరిజనులకు ప్రత్యేకంగా మరో 1 శాతం రిజర్వేషన్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకుంది .( అంతకు ముందు ఎస్సీ,ఎస్టీలకు కలిపి రిజర్వేషన్లు ఉండేవి) ఇలా తమిళనాడులో రిజర్వేషన్ శాతం 69 శాతానికి చేరింది.అప్పటి వరకు 69 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోన్న తమిళనాడు ప్రభుత్వానికి, 1992లో ఇందిరా సాహ్ని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (మండల్ కేసు) లో సుప్రీం కోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. అరుదైన, అసాధారణ పరిస్థితుల్లో తప్ప దేశంలో రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని తీర్పులో పేర్కొంది. ఇది తమిళనాడులో అప్పటికే అమలు అవుతున్న 69 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉంది. అయితే, 69 శాతం రిజర్వేషన్లను యథావిధిగా అమలు చేసేందుకు తమిళనాడు రాజకీయ నేతలు రాజకీయ చతురతను ప్రదర్శించారు. నాటి తమిళనాడు సీఎం జయలలిత వ్యూహాత్మకమైన తీరులో వ్యవహరించింది.ఇందిరా సాహ్నీ కేసు తీర్పుతో తమిళనాడు రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయి. దీంతో జయలలిత ప్రభుత్వం తమిళనాడు రిజర్వేషన్ చట్టాన్ని తెచ్చింది. 1994 తమిళనాడు శాసన సభలో చట్టం - 45 ను ఆమోదించింది. ఈ చట్టం రాష్ట్రంలోని విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 69 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నది ప్రధాన లక్ష్యం. ఆ తర్వాత 69 శాతం రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగ రక్షణ కల్పించే దిశగా అడుగులు వేసింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో 69 శాతం రిజర్వేషన్ల అమలును జయలలిత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సాయంతో చేర్పించగలిగింది. ఇందుకు 1994లో 76వ రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో 69 శాతం తమిళనాడు రిజర్వేషన్ల అంశాన్ని చేర్చడం జరిగింది. ఈ షెడ్యూల్‌లో చేరిన చట్టాలపై న్యాయస్థానాలు సమీక్షించలేవు. ఇలా తమిళనాడు రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించబడింది. ఈ కారణంగా, రిజర్వేషన్లు 50 శాతం పరిమితి దాటకూడదని సుప్రీం తీర్పు ఇచ్చినప్పటికీ, తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి.రాజకీయ బేరసారాలు: ఈ రాజ్యాంగ సవరణను చేయించడానికి అప్పటి ముఖ్యమంత్రి జయలలిత, కేంద్రంలో పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై గట్టి రాజకీయ ఒత్తిడి తీసుకొచ్చారు. తమిళనాడులో కాంగ్రెస్-ఏఐఏడీఎంకే కూటమి బలమైనదికావడంతో, ఈ రాజ్యాంగ సవరణకు అప్పటి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వక తప్పలేదు. రాజకీయ అనివార్యత కారణంగానే 1994లో 76వ రాజ్యాంగ సవరణ చేసి తమిళనాడు రిజర్వేషన్ చట్టం ను 9వ షెడ్యూల్‌లో చేర్చడం జరిగింది.జయలలిత ఒత్తిడికి తలొగ్గిన పీవీ: 1991లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ - అన్నాడీఎంకే తమిళనాడులో పొత్తు పెట్టుకుని అద్భుత ఫలితాలను సాధించాయి. ఆ సమయంలో ప్రధానిగా ఉన్న పీవీ నరసింహారావు పార్లమెంట్‌లో తన ప్రభుత్వ మెజార్టీ కోసం అన్నాడీఎంకే మద్దతుపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఏ మాత్రం జయలలిత కినుక వహించినా పీవీ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి. ఈ కారణంతో తమిళనాడు రిజర్వేషన్ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని జయలలిత పీవీపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఈ కారణంతో పీవీ నరసింహారావు ప్రభుత్వం జయలలిత ఒత్తిడి మేరకు తమిళనాడు రిజర్వేషన్ల చట్టానికి 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా రాజ్యాంగ రక్షణ కల్పించింది. అంతే కాకుండా, తమిళనాడు ద్రవిడ ఉద్యమంతో ముడిపడి ఉన్న రిజర్వేషన్ విధానం. ఇది చాలా కాలం నుంచి అమల్లో ఉంది. దీనికి వ్యతిరేకంగా ఏం జరిగినా ఆ రాష్ట్రంలో పెద్ద స్థాయిలో ఉద్యమం చెలరేగవచ్చు అన్న భావనతో కేంద్రం తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చక తప్పలేదు.**

## ఆఫ్గన్ కు అండగా భారత్

**న్యూఢిల్లీ, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

ఆఫ్ఘనిస్తాన్ అనగానే ఉగ్రవాదం దేశం అన్న భావన కలుగుతుంది. తాలిబాన్లు చేసే అరాచకాలు అలా ఉంటాయి. పాకిస్తాన్ సహకారంతో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్లు ఉగ్రవాదులుగా ఎదిగారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చి తాలిబాన్ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఇక తాలిబాన్ల ఆంక్షలతో అక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అయితే తమ మిత్ర దేశం అనుకుంటున్న ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వంతో భారత్ మైత్రి పెంచుకుంటోంది. ఇదే ఇప్పుడు మన దాయాది దేశం పాకిస్తాన్‌కు మింగుడు పడడం లేదు . భారత్?ఆఫ్ఘనిస్తాన్ మధ్య సంబంధాలు ఎప్పుడూ ప్రత్యేకమైనవి. ఈ రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక బంధాలు శతాబ్దాల నుంచి కొనసాగుతున్నాయి. అయితే, పాకిస్తాన్ ఈ మైత్రిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నా, ఇటీవలి పరిణామాలు భారత్?ఆఫ్ఘన్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నాయి.భారత్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య సంబంధాలు పురాతన కాలానికి చెందినవి. మహాభారతంలోని గాంధారి కథ ఈ రెండు ప్రాంతాల మధ్య ఉన్న సాంస్కృతిక లింక్‌ను సూచిస్తుంది. ఆ తర్వాత కాలంలో, కాబూల్ నుంచి వచ్చిన వ్యాపారులు భారతదేశంలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేవారు. రవీంద్రనాథ్ ఠాకూర్ వంటి మహాకవి ఈ కాబూలీ వ్యాపారుల జీవితాలను తన సాహిత్యంలో చిత్రించారు, ఇది రెండు సమాజాల మధ్య ఉన్న ఆప్యాయతను ప్రతిబింబిస్తుంది. ఈ చారిత్రక బంధాలు కేవలం సాహిత్యానికి పరిమితం కాకుండా, సమాజిక?ఆర్థిక స్థాయిలో కూడా విస్తరించాయి. ఆఫ్ఘన్ ప్రభుత్వాలు ఎప్పుడూ భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలను కోరుకున్నాయి, అయితే పాకిస్తాన్ ఈ అవకాశాలను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంది. విమాన హైజాక్ సంఘటనలు, సరిహద్దు ఘర్షణల సమయంలో పాకిస్తాన్ తనను ఆఫ్ఘన్ మిత్రుడిగా భావించినా, వాస్తవానికి ఆఫ్ఘన్ ఎల్లప్పుడూ భారత్ వైపు మొగ్గు చూపింది. ఇటువంటి చారిత్రక సమానతలు ఇప్పటి దౌత్య సంబంధాలకు పునాది వేస్తున్నాయి, పాకిస్తాన్‌కు ఇది సవాలుగా మారుతోంది.2021లో తాలిబాన్ ఆఫ్ఘనిస్తాన్‌లో అధికారం చేపట్టిన తర్వాత, అంతర్జాతీయ సమాజం ఆందోళనలు వ్యక్తం చేసింది. అయితే, భారత్ ఈ పరిస్థితిని దౌత్యపరంగా ఎదుర్కొంది. 2022లో భారత దౌత్యవేత్త జేపీ.సింగ్ ఆఫ్ఘన్ పర్యటన చేయడం పాకిస్తాన్‌కు ఊహించని దెబ్బ. పాక్ భావన ప్రకారం, తాలిబాన్ భారత్ నిర్మాణాలను ధ్వంసం చేస్తుందని ఆశించింది, కానీ తాలిబాన్ వాటిని రక్షించడానికి బాధ్యత తీసుకుంది, ఇది పాక్ అంచనాలను తలకిందులు చేసింది. ఇటీవలి సమావేశాలు ఈ మైత్రిని మరింత బలపరిచాయి. 2025లో దుబాయ్‌లో ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి అమిర్ ఖాన్ ముట్టగీ, భారత సెక్రెటరీ వివేక్ మిస్త్రీ మధ్య జరిగిన చర్చలు పాకిస్తాన్‌కు మరో ఆఘాతం. అలాగే, పహల్గాం దాడి తర్వాత ఆఫ్ఘన్ మంత్రి భారత్‌కు మద్దతు తెలపడం, ఉగ్రవాదాన్ని ఖండించడం పాక్ ఆశలను భగ్నం చేసింది. తాలిబాన్ నాయకులు భారత ప్రతినిధులతో తరచూ సమావేశమవుతున్నారు, ఇది పాకిస్తాన్ పెంచిన తాలిబాన్ తమకు వ్యతిరేకంగా మారుతున్నట్టు సూచిస్తుంది. ఈ పరిణామాలు భారత్ దౌత్య విజయాన్ని ప్రతిబింబిస్తాయి, పాక్ ఆధిపత్య ఆశలను దెబ్బతీస్తున్నాయి.ఇదిలా ఉంటే ఆఫ్ఘనిస్తాన్‌కు పలు సందర్భాల్లో సహాయం అందించిన మానవత్వాన్ని చాటుకుంది. కోవిడ్ కాలంలో భారీ మొత్తంలో మందులు సరఫరా చేయడం, రైతులకు 40 వేల లీటర్ల క్రిమిసంహారక మందు పంపడం వంటివి తాలిబాన్ మనసును మార్చాయి. ఇటీవలి భూకంప సమయంలో భారత్ ముందుగా స్పందించి, వెయ్యి టెంట్లు, 15 టన్నుల ఆహారం, 20 టన్నుల మందులు, దుప్పట్లు, జనరేటర్లు అందించింది. ఇది ఇతర దేశాలకన్నా వేగవంతమైన స్పందనగా నిలిచింది. ఈ సహాయం తాలిబాన్‌ను భారత్ వైపు మరల్చింది. ఆగస్టులో ఆఫ్ఘన్ మంత్రి భారత్ పర్యటనను పాక్ అడ్డుకున్నా, అక్టోబర్ 9 నుంచి 16 మధ్య ఆ మంత్రి రాక పాక్‌కు మరో దెబ్బ. అలాగే, భారత మహిళా ప్రతినిధి మండలి ఆఫ్ఘన్ పాఠశాలల్లో సౌకర్యాలను పరిశీలించడం, తాలిబాన్ వారికి ఘన స్వాగతం పలకడం ఇరు దేశాల మధ్య విశ్వాసాన్ని పెంచుతోంది. ఈ మానవతా ప్రయత్నాలు కేవలం సహాయానికి పరిమితం కాకుండా, దీర్ఘకాలిక సంబంధాలకు పునాది వేస్తున్నాయి.ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ దౌత్యం ఆఫ్ఘన్‌ను మిత్రదేశంగా మార్చుతోంది. ఆఫ్ఘన్ నుంచి వలస వచ్చినవారు తిరిగి తమ దేశానికి వెళ్లేలా తాలిబాన్ ఒప్పించడం, కాబూల్ గురుద్వారాను పునరుద్ధరించడం వంటివి భారతీయులపై తాలిబాన్ సహనాన్ని చూపిస్తున్నాయి. ఇది పాకిస్తాన్‌కు నిద్రపట్టకుండా చేస్తోంది. ఎందుకంటే తమ ప్రభావంలో ఉండాల్సిన తాలిబాన్ భారత్ వైపు మొగ్గు చూపుతోంది.మొత్తంగా, ఈ సంబంధాలు భారత్‌కు వ్యూహాత్మక ప్రయోజనాలను అందిస్తున్నాయి, పాకిస్తాన్ ఆధిపత్య ఆశలను దెబ్బతీస్తున్నాయి. భవిష్యత్తులో ఈ మైత్రి మరింత బలపడితే, దక్షిణాసియా రాజకీయాల్లో మార్పులు తప్పవు.

## వైయస్ జగన్ పర్యటనకు
# వెల్లువలా తరలివచ్చిన జనం

(మొదటిపేజీ తరువాయి )

ఇది వైద్య విద్య చదవాలన్న కోట్లాది పేద విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను దూరం చేసింది. ఇదే కూటమి ప్రభుత్వంపై ప్రజాగ్రహానికి కారణంగా నిలుస్తోంది. అందుకే వారంతా కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

- మహత్తర లక్ష్యంతో మొదలుపెడితే..:

మెడికల్ కాలేజీల విషయంలో తమ పార్టీ విధానాన్ని నిర్మాణం ఆపివేసిన నర్సీపట్నం వైద్య కళాశాల సాక్షిగా జగన్‌గారు స్పష్టం చేశారు. ప్రతి ఒక్క మెడికల్ కాలేజీ ఒక ఆధునిక దేవాలయం అన్న ఆయన, వాటి ద్వారా పేద విద్యార్థులకు వైద్య విద్యను మరింత చేరువ చేయాలని, ఆ ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించాలని భావించారు. అందుకే ఒకేసారి 17 మెడికల్ కాలేజీల పనులు మొదలుపెట్టి, తమ హయాంలో 7 కాలేజీల పనులు పూర్తి చేశారు. ఇప్పుడు పది కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయం వైద్య విద్యను అభ్యసించాలన్న పేద విద్యార్థుల కలను దూరం చేస్తోంది. అందుకే జగన్‌గారి పర్యటనకు ఉవ్వెత్తున తరలివచ్చి, ప్రభుత్వ నిర్ణయం తప్పు అని తేల్చి చెప్పారు.

-పీపీపీ విధానం వల్ల ఫీజుల మోత:

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 50 శాతం ఉచిత సీట్లలో ట్యూషన్ ఫీజును కేవలం రూ.15 వేలుగా మా ప్రభుత్వ హయాంలో నిర్ణయించాం. ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీలు కొనసాగి ఉంటే ఇప్పుడు కూడా అంతే ఫీజు ఉండేది. కానీ, ఇప్పుడు ఆ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల వాటిలో ఫ్రీ సీటు వచ్చినా రూ.3.50 లక్షల ట్యూషన్ ఫీజు చెల్లించాలి. అంటే పీపీపీ విధానంలో ప్రైవేటు వారికి కాలేజీలు అప్పగిస్తే, మెరిట్ ద్వారా సీటు వచ్చినా కూడా రూ.3.50 లక్షలు ట్యూషన్ ఫీజు కట్టాల్సిన పరిస్థితి వస్తోంది.

ఇక బీ కేటగిరీలో ఫీజు రూ.19 లక్షల నుంచి రూ.20 లక్షలు కాగా, మేనేజ్‌మెంట్ కోటాలో, అదే బీ కేటగిరీ సీట్ల ఫీజు మూడు రెట్లు ఎక్కువగా, అంటే రూ.60 లక్షలుగా నిర్ణయించారు. మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో మారిస్తే, మెరిట్‌లో సీట్లు సాధించిన విద్యార్థులు నష్టపోయే పరిస్థితి వస్తుంది.

- దారి పొడవునా సమస్యల ఏకరువు:

జగన్‌గారి పర్యటనలో విశాఖ నుంచి నర్సీపట్నం మెడికల్ కాలేజీ వరకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరాగా, పలు చోట్ల చాలా మంది ఆయన్ను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు.

విశాఖ విమానాశ్రయం నుంచి పర్యటన మొదలైన వెంటనే కాకానినగర్ వద్ద జగన్‌గారిని కలిసిన విశాఖ స్టీల్ ప్లాంట్ పోరాట కమిటీ ప్రతినిధులు జగన్‌గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వారికి సంఘీభావం ప్రకటించిన జగన్‌గారు, పార్టీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. మరోవైపు కూటమి ప్రభుత్వం గోపాలపట్నంతో పాటు విశాఖలో పలు ప్రాంతాల్లో రోడ్డున పడేసిన స్ట్రీట్ హాకర్స్ కూడా జగన్‌గారిని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని తెలిపారు. వారికి కూడా పార్టీ తరపున అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి.. చోడవరం, మాడుగుల నుంచి వచ్చిన రైతులు గడిచిన 10 మాసాలుగా చెరుకు బకాయిలను చెల్లించలేదని చెప్పారు. మరోవైపు తమకు ఏడాదిగా జీతాలు ఇవ్వలేదని కార్మికులు తమ కష్టాలు ఏకరువు పెట్టారు. గతంలో వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.89 కోట్లు ఇచ్చి, షుగర్ ఫ్యాక్టరీని కాపాడిన విషయాన్ని గుర్తు చేసిన వారు, ఇప్పుడు షుగర్ ఫ్యాక్టరీ రైతులకు రూ.35 కోట్లు బకాయి పడిందని చెప్పారు.

అనంతరం కృష్ణంపాలెంలో ఏపీఐఐసీ నిర్వాసితులు, తాళ్లపాలెం తర్వాత రాజీపేట బల్క్ డ్రగ్ పార్క్ నిర్వాసితులు తాము నష్టపోతున్న విషయాన్ని జగన్‌గారి దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం బాధితులను ఒప్పించకుండా ముందుకు వెళ్తే.. వారికి వైయస్ఆర్‌సీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మొత్తం 60 కిలోమీటర్ల ప్రయాణానికి ఏకంగా 6 గంటలు పట్టిందంటే.. ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత తెలుస్తోంది. వీటన్నింటి ద్వారా ఉత్తరాంధ్రకు ఈ ప్రభుత్వం చాలా అన్యాయం చేస్తోందన్న విషయం కూడా తేటతెల్లమైంది.

- జగన్ గారి హయాంలో ఉత్తరాంధ్ర ప్రగతి:

వైయస్.జగన్ హయాంలో ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఉద్దానం కిడ్నీ ఆసుపత్రి, మూలపేట పోర్టు, భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, కురుపాం ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ, సాలూరు ట్రైబల్ యూనివర్సిటీ, విజయనగరం, పార్వతీపురం, పాడేరు, నర్సీపట్నం మెడికల్ కాలేజీలు, ఇన్ఫోసిస్ సంస్థలు, ఆదానీ డేటా సెంటర్, ఎన్ టీ పీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు వంటి ఇన్ని అభివద్ధి కార్యాక్రమాలు చేపట్టారు. చివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రతిపాదించి నిర్మించిన గ్లాస్ బ్రిడ్జికి కూడా చంద్రబాబు ప్రారంభించి ఫోటో తీసుకుంటారు. ఇన్ని చరిత్రలో నిల్చిపోయే కార్యక్రమాలు వైయస్ఆర్‌సీపీలో చేశాం.

చంద్రబాబునాయుడు పేరు చెబితే గుర్తుకు వచ్చే ఒక్క కార్యక్రమము కూడా గుర్తుకు రాదు. నాలుగోసారి ముఖ్యమంత్రి అయినా చంద్రబాబు ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదు.

- విశాఖ సీపీ తీరు అభ్యంతరకరం:

మొత్తంగా వైయస్.జగన్ పర్యటనకు నిబంధనల పేరుతో ఎన్ని అంక్షలు పెట్టినా, ఎంతగా నియంత్రించినా, స్థానిక నేతలను అడ్డుకుని నిర్భంధించినా అన్ని అడ్డంకులను దాటుకుని వచ్చిన ప్రతి ఒక్కరికీ పార్టీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. అదే విధంగా విశాఖపట్నం కేజీహెచ్ వద్ద పోలీస్ కమిషనర్ ఒక మాజీ ముఖ్యమంత్రి పట్ల వ్యవహరించిన తీరు అత్యంత అభ్యంతరకరం. సీపీ హుందాగా వ్యవహరించి ఉంటే బాగుండేది. ఆయన రాజకీయ నాయకుడి తరహాలో మాట్లాడారు, దాన్ని సరిదిద్దుకోవాలని ఆయనకు సూచిస్తున్నాం.

- సీఎం రమేష్ క్యాపిటలిస్ట్ మ్యాన్:

అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అంటే కామన్ మ్యాన్ కాదు కాపిటలిస్ట్ మ్యాన్. ఆయనకు ప్రైవేటీకరణ కార్యక్రమాలే నచ్చుతాయి. ఆయనకు భూములు, షుగర్ ఫ్యాక్టరీలు, కాలేజీలు కావాలి. ఆయన ఉత్తరాంధ్రను ఉద్ధరించడానికి రాలేదు.. ఆయన ప్రజలను మరిచిపోయి చాలా కాలం అయింది. ఆయన అనకాపల్లి వచ్చింది సహజ వనరుల దోపిడీ కోసమేనని అక్కడి జనం అనుకుంటున్నారు. పీపీపీ విధానం మంచిదంటున్న సీఎం రమేశ్.. ఒకటి రెండు మెడికల్ కాలేజీలు కొనుక్కునే ఆలోచనలో ఉన్నారు. అందుకే పీపీపీ విధానాన్ని సమర్థిస్తున్నారు. ఋషికొండపై తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి. ఋషికొండ వైఎస్ జగన్ ది అయితే.. చంద్రబాబు వచ్చి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేయమనండి.

-పిల్లల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్క లేదు:

నర్సీపట్నం కార్యక్రమం తర్వాత వైయస్.జగన్ విశాఖపట్నం చేరుకుని, కేజీహెచ్‌లో జాండిస్‌తో చికిత్స పొందుతున్న కురుపాం గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులను పరామర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికార్లకు, మంత్రుల సమన్వయలోపం వల్ల పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన ఇద్దరు బాలికల కుటుంబాలకు పార్టీ తరపున రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తప్పు: కెకె రాజు - వైయస్ఆర్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు

ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండాలి. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో జగన్ గారు ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా 5 కాలేజీల్లో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తి చేసుకుని క్లాసులు కూడా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైయస్.జగన్ మార్కు ఆరోగ్య రంగంపై ఉండకూడదన్న కక్షతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా వైయస్.జగన్ నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేస్తున్నారు. దీన్ని మరింత ఉధృతం చేసి, ప్రభుత్వం మెడలు వంచి ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కాలేజీలు కొనసాగేలా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా వైయస్.జగన్ నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించారు. ఆయన పర్యటనను ప్రభుత్వ పెద్దలు అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ, ఏమీ చేయలేకపోయారు.

జగన్‌గారికి ప్రజల నుంచి వచ్చిన బ్రహ్మాండమైన స్పందనతో కూటమి నేతలకు కళ్లు బైర్లు కమ్మాయి. ఎన్నికల్లో స్టీల్ ప్లాంట్‌తో పాటు ప్రజలకు అనేక హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. వారందరూ తమ కష్టాలను వైయస్.జగన్ కు చెప్పుకున్నారు. సుదీర్ఘకాలం పాటు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఉత్తరాంధ్రాకు తీరని అన్యాయం చేశాడు. మరోవైపు ఈ ప్రాంతానికి వలస వచ్చిన నాయకులకు కూడా ప్రజలు రాజకీయ భవిష్యత్తు కలిపించినా.. కూటమి పార్టీ నేతలు మాత్రం కృతజ్ఞత లేకుండా ప్రవర్తిస్తున్నారు. వారి రాజకీయ భవిష్యత్తును ప్రజలు రాబోయే రోజుల్లో బంగాళాఖాతంలో కలపడం ఖాయమని కే కే రాజు హెచ్చరించారు.

## జీఎస్టీ తగ్గింపును ప్రజలందరూ వినియోగించుకోవాలి

**రాయచోటి, (లక్ష్యం న్యూస్)**

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందించే జీఎస్టీ తగ్గింపును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. శుక్రవారం రాయచోటిలోని సాయి శుభ ఫంక్షన్ హాల్ లో జిల్లా వాణిజ్య పన్నుల శాఖ మరియు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ వస్తువులకు జీఎస్టీ తగ్గింపు పై సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం మరియు ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, ప్రభుత్వాలకు ఆర్థికంగా నష్టమైనప్పటికీ ప్రజల సంక్షేమం దృష్ట్యా జిఎస్టి తగ్గింపు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ఎలక్ట్రానిక్ వస్తువులైన ఫ్రిడ్జ్ మైక్రోవేవ్ ఓవెన్ టీవీలు వాషింగ్ మెషిన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తక్కువ ధరకే ప్రజలకు అందుబాటులో ఉంటాయని ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సెల్ఫీ బూతు దగ్గర నిలబడి జిల్లా కలెక్టర్ సెల్ఫీ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం కలెక్టరేట్లో జిల్లా ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ప్రజల నుంచి వివిధ అంశాలపై సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణ, మూడంచల గ్రామం మరియు వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ. ఆసుపత్రుల సేవలు, రీ సర్వే, తదితర సేవలపై సమీక్షిస్తూ ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించాలని సూచించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో పెండింగ్ పనులు ఏమైనా ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఆసుపత్రులలో మందుల కొరత ఉండరాదని, ఈ-ఔషధీ లో మందుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయంపై సమీక్షిస్తూ ఈ-పంట వివరాలు నమోదు చేసి పౌరసరఫరాల శాఖ ద్వారా బియ్యం సేకరణ జరగాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతుల పింఛన్లకు సంబంధించి అప్పీళ్ల పై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులకు ఆయా శాఖల అంశాలకు సంబంధించి తగు సూచనలు జారీ చేశారు. మూడంచెల గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్రిశంకు స్వర్గంలో గ్రూప్ వన్ అభ్యర్థులు

**హైదరాబాద్, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

గ్రూప్-1కు ఎంపికకాని అభ్యర్థులు, ఇప్పటికే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న గ్రూప్-1 ఉద్యో గులు త్రిశంకు స్వర్గంలో ఉన్న పరిస్థితి నెలకొన్నది. తమకు ఉద్యోగం వస్తుందని కొందరు భావిస్తుంటే.. తమ ఉద్యోగాలు ఉంటయా? లేక ఊడుతాయా? అని అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న మరికొందరు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.గ్రూప్-1 నియామకాలను నిలిపివేయా లని కొందరు గ్రూప్-1 అభ్యర్థులు ఇటీవల వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు మంగళవారం డిస్పోజ్ చేయడంతో హమ్మయ్య అని ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకున్నా, హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది తీర్పుకు లోబడే వారి నియామకాలు ఉంటాయని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం గమనార్హం.అంటే అపాయింట్‌మెంట్‌లు తీసుకున్నా ఉద్యోగాలు ఉండొచ్చు.. లేకుంటే ఊడొచ్చునని అభ్యర్థులు చెబుతున్నారు. ఉద్యోగాలు రానివారు, ఉద్యోగాలు వచ్చినవారు.. ఇలా రెండు వర్గాలుగా చీలిపోయిన గ్రూప్-1 అభ్యర్థులు ఎవరికి వారు తమకే న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. కానీ, న్యాయస్థానాలు వెలువరించే తీర్పును బట్టే ఎవరికి ఉద్యోగాలొస్తాయి? ఎవరికి పోతాయి? అనేది స్పష్టమవుతుందని అంతా భావిస్తున్నారు.దాదాపు 14 ఏళ్ల తర్వాత గ్రూప్ నియామకాలు జరుగుతున్నాయి. అయితే తొలి నుంచి ఈ నియామకాల ప్రక్రియ వివాదాల చుట్టే తిరుగుతోంది. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న అభ్య ర్థులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా 2022 ఏప్రిల్ 26న 503 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. 2022 అక్టోబర్ 16న ప్రిలిమి నరీ పరీక్షలు నిర్వహించగా, 2023 ఆగస్టులో మెయిన్ పరీక్షలు నిర్వహిస్తామని టీజీపీఎస్సీ ప్రకటించింది.ఈలోగా గ్రూప్1తోపాటు పలు పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం వెలుగులోకి రావడంతో గ్రూప్1 పరీక్షను టీజీపీఎస్సీ రద్దు చేసింది. 2023 జూన్ 11న మరోసారి ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షను పార దర్శకంగా నిర్వహించలేదని, లోపాలు జరిగాయ ని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో అప్పుడు కూడా ఆ పరీక్షను రద్దు చేస్తూ తీర్పు వెలువడింది.ఆతర్వాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకావడం, టీజీపీఎస్సీ ప్రక్షాళన చేయడంతో పాటు 503 పోస్టులకు గానూ మరో 60 పోస్టులను కలిపి మొత్తం 563 పోస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో గ్రూప్-1 నోటిఫికేషన్‌ను వేసింది. 2024 జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష, అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 10న అభ్యర్థుల ప్రొవిజనల్ మార్కుల జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేయగా, మార్చి 30న జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసింది.అదేవిధంగా ఏప్రిల్ 10న 563 ఉద్యోగాలకు ఎంపికైన గ్రూప్-1 అభ్యర్థుల తుది జాబితా ను విడుదల చేసి ధ్రువపత్రాల పరిశీలనను కూడా చేపట్టింది. అయితే మెయిన్ పరీక్షల్లో అవకతవకులు జరిగాయని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో గ్రూప్ మెయిన్ పరీక్షల మార్కులు, ర్యాంకింగ్ జాబితాను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఈ ఏడాది సెప్టెంబర్ 9న తీర్పు ఇచ్చింది.అంతేకాకుండా జవాబు పత్రాలను మరోసారి మూల్యాంకనం చేయాలని లేదా తిరిగి మెయిన్స్ పరీక్షను ఎనిమిది నెలల్లోగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయి తే దీనిపై గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన కొం దరు అభ్యర్థులు, టీజీపీఎస్సీ.. హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళ్లడంతో సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధిస్తూ సెప్టెంబర్ 24న మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.ప్రభుత్వం నియామకాలు చేపడితే అవి రిట్ అప్పీళ్ల తుది తీర్పుకు లోబడి ఉంటాయని కూడా చెప్పడం గమనార్హం. దీంతో ఉద్యోగాలకు ఎంపిక కాని కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఆ పిటిషన్‌ను కోర్టు మంగళవారం డిస్పోజ్ చేసింది.

### మళ్లీ సుప్రీంకు వెళ్లే ఆలోచన..!

టీజీపీఎస్సీ గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేయడంతో సెప్టెంబర్ 27న వారికి నియామకపత్రాలను రాష్ట్ర ప్రభు త్వం అందజేసింది. 562 మందికి సీఎం రేవంత్ రెడ్డి తన చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. నియమాకపత్రాలు పొందిన వారి లో కొందరు డిప్యూటీ కలెక్టర్లు, ఎక్సైజ్ డీఎస్పీలు, ఇతర పోస్టులకు చెందినవారూ ఉన్నారు. చాలా మంది ఇప్పటికే తమ తమ ఉద్యోగాల్లో చేరారు కూడా.అయితే కోర్టు తుది తీర్పుకు లోబడే మీ ఉద్యోగాలుంటాయని అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న అభ్యర్థుల నుంచి అధికారులు డిక్లరేషన్ తీసుకున్నట్లు తెలిసింది. ఒకవేళ వీరికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు వస్తే వీరి ఉద్యోగాలకు భద్రత ఉంటుంది.

# సెల్ ఫోన్ వినియోగం తగ్గించండి

## ప్రధాన సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణం




**మాచర్ల రూరల్ :లక్ష్యం: అక్టోబర్ 10**
మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవ కమిటీ, మాచర్ల ఆధ్వర్యంలో మాచర్ల మండలం కంభంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రధాన సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మానసికంగా బలంగా ఉంటేనే శారీరక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని, అందువల్ల సకాలంలో భోజనం, నిద్ర, వ్యాయామం చేయడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. నేటి తరం సెల్ ఫోన్ లకు అతిగా అతుక్కు పోవడం వల్ల అనేక మానసిక సమస్యలు, రుగ్మతలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అవసరమైనప్పుడు తప్ప మొబైల్‌ను తక్కువగా ఉపయోగించాలని, ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రభుత్వ న్యాయవాది జి. వెంకటేశ్వర్లు, మాచర్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వై. రమేష్ బాబు గారు, కంభంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం

## వ్యాపారులకు, రైతులకు సమానంగా లాభం - వ్యవసాయ ఉత్పత్తులపై కూడా తగ్గిన జీఎస్టీ



**మంగళగిరి అక్టోబర్ 10 ( లక్ష్యం న్యూస్ ప్రతినిధి)**
మంగళగిరి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం సూపర్ జీఎస్టీ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం ని సేల్స్ టాక్స్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, నగర పాలక సంస్థ కమిషనర్ అలీమ్ భాష, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ హాజరై మాట్లాడారు. సూపర్ జీఎస్టీ విధానంతో వ్యాపార, వ్యవసాయ రంగాలకు కొత్త ఊపిరి లభించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్నుల భారం తగ్గించే దిశగా తీసుకున్న సూపర్ జీఎస్టీ చర్యలు అన్ని వర్గాలకూ ఉపయోగకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఉపయోగించే విత్తనాలు, ఎరువులు, కీటక నాశకాలు, పశువుల ఆహారం, వ్యవసాయ యంత్ర పరికరాలు మొదలైన వాటిపై జీఎస్టీ రేట్లు గణనీయంగా తగ్గడం రైతులకు పెద్ద ఉపశమనమని తెలిపారు..."రైతులు తమ ఉత్పత్తి ఖర్చులు తగ్గించుకొని మరింత లాభం పొందే అవకాశం కల్పించడమే ఈ సూపర్ జీఎస్టీ ఉద్దేశ్యం. అంతేకాకుండా చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు కూడా తక్కువ పన్ను రేట్లతో తమ వ్యాపారాలను విస్తరించుకునే అవకాశం పొందుతున్నాయి" అని వివరించారు...అలాగే వైద్య ఉత్పత్తులు, గృహ వినియోగ వస్తువులు, విద్యుత్ పరికరాలు, అవసరమైన దినసరి వస్తువులపై కూడా పన్ను తగ్గించడం ద్వారా సాధారణ ప్రజల జీవన విధానంపై భారం తగ్గిందన్నారు. సూపర్ జీఎస్టీ వల్ల మార్కెట్ స్థిరత్వం ఏర్పడి ప్రజలకు తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు లభిస్తున్నాయని వివరించారు..వ్యాపారవేత్తలు, రైతులు, వినియోగదారులు ఈ విధానం ద్వారా లభించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాపారంలో పారదర్శకత పెరుగుతోందని, పన్ను చెల్లింపులు సులభతరమవడంతో ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతోందని తెలిపారు. జీఎస్టీ మినహాయింపు, తగ్గుదల సదుపాయం కల్పించిన ఎలక్ట్రానిక్ వస్తువులు, నిత్యావసర వస్తువులను కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను అతిథులు తిలకించారు...ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, ఆర్టీఓ బాలకృష్ణ , టిడిపి నాయకులు సంకా బాలాజీ గుప్తా,అల్లక నమశ్శివాయ,పలువురు వ్యాపారవేత్తలు, రైతు సంఘాల ప్రతినిధులు, మార్కెట్ కమిటీ అధికారులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# కొల్లిపరలో కుక్కల పెరుగుదలపై ప్రజల్లో ఆందోళన, ఆసుపత్రిలో వ్యాక్సిన్ సిద్ధంగా ఉంది : డాక్టర్ శ్రావణి



**కొల్లిపర అక్టోబర్ 10 (లక్ష్యం న్యూస్)**
మండలంలో కుక్కల సంఖ్య పెరగడంతో గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొల్లిపర సీ హెచ్ సీ వైద్యురాలు శ్రావణి మాట్లాడుతూ, నిత్యం పలువురు కుక్కల దాడికి గురై వైద్యశాలలో చికిత్సకు వస్తున్నారని తెలిపారు. కుక్క కరిచిన వెంటనే సబ్బుతో శుభ్రంగా కడుక్కుని, వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. బాధితులు రెండు మూడు రోజులు ఆలస్యం చేయకుండా సకాలంలో వైద్యం పొందాలని ఆమె తెలిపారు. కుక్క కరిచిన బాధితులు సొంత వైద్యం చేసుకోవద్దని, అలాగే ఆకుపసర మందులు లాంటివి వాడకూడదని తెలిపారు. మండల కేంద్రంలో గత నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికీ అయిదుగురికి చికిత్స అందించామని, వారికి రేబిస్ నిరోధక టీకాలు వేసి మెరుగైన వైద్యం అందిస్తున్నామని వెల్లడించారు. కుక్క కాటుకు గురైన వారు నిర్లక్ష్యం చేయవద్దని, తగు జాగ్రత్తలు తీసుకొని వెంటనే స్పందించి ఆసుపత్రికి వచ్చి వ్యాక్సిన్ తీసుకోవాలని, వ్యాక్సిన్ అందుబాటులో ఉందని ఆమె తెలిపారు.

# అట్టహాసంగా పబ్బిశెట్టి వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మి అవార్డుల ప్రధానం




**గుంటూరు అక్టోబర్ 10 లక్ష్యం ప్రతినిది**
సమాజసేవే లక్ష్యంగా పయనిస్తామని ప్రపంచ అందుల అసోసియేషన్ అధ్యక్షులు సంతోష్ కుమార్, ప్రముఖ సామాజిక సేవకులు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రెవెన్యూ మండపంలో పబ్బిశెట్టి వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మి అవార్డుల ప్రధానం జరిగింది. సంతోష్ కుమార్ కు. సత్యనారాయణకు అవార్డులు ప్రధానం చేశారు మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు. ప్రొఫెసర్ రంగయ్య నీర్వాహకులు పూర్ణచంద్రరావు, మధుసూదన్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు సంతోష్ కుమార్ ను.సత్యనారాయణ ను.అనూషను దృశ్యాలు ఆత్మీయంగా సత్కరించారు. సమాజానికి వారు చేసిన సేవలను కొనియాడారు. భవిష్యత్తులో వీరిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని భక్త పిలుపునిచ్చారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి- ప్రధానోపాధ్యాయురాలు నాగమణి

**మాచర్ల రూరల్ : అక్టోబర్ 10 : లక్ష్యం**
బాల్య వివాహాలను సమూలంగా అరికట్టాలని కొప్పునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో వైద్య సిబ్బందితో కలిసి బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ, అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త లలానార్ రూజ్వెల్ట్ జన్మదినాన్ని అంతర్జాతీయ బాలికల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబించేలా మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని,




వారికి విద్య, పోషణ, వివక్షత లేని వాతావరణం, చట్టపరమైన హక్కులు పొందేలా చూడాలని ఉద్ఘాటించారు. బలవంతపు బాల్యవివాహాలపై తప్పనిసరిగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. సమగ్ర శిశు అభివృద్ధి సేవలు ఐసీడీసీ సూపర్ వైజర్ బి.అన్నపూర్ణ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు బాలికల విద్యను మరింతగా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అప్పారావు, పెదయాసపు, వెంకట నారాయణ, వైద్య సిబ్బంది సుబ్బాచారి, అంగన్వాడీ సిబ్బంది గోవిందమ్మ, జ్యోతి, ధనలక్ష్మి, శాంత లత మరియు పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# పేద, మధ్యతరగతి ప్రజలకు వరంగా జీఎస్టీ సంస్కరణలు

గుంటూరు ఏ.సి. కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, నగర్ కమిషనర్ శ్రీనివాసులు సహచర ప్రజానిధులు, అధికారులతో కలసి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ లో గుంటూరుకు చెందిన పలు హోమ్ అప్లయెన్సెస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్టైల్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ప్రజలు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అధికారులు జీఎస్టీ 2.0లోని కొత్త నిబంధనలు, వినియోగదారుల రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి నజీర్ శ్రీనివాసులు మాట్లాడారు ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక మైలురాయి అన్నారు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలకు ఇవి నిజమైన వరంగా నిలుస్తున్నాయి అన్నారు. అవసరమైన ఉత్పత్తులపై పన్నులు తగ్గించడంతో వినియోగదారులు నేరుగా లాభపడుతున్నారు అన్నారు. తక్కువ పన్నులతో అందుబాటులోకి వస్తున్న వస్తువులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామిగా మారాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి,నసీరు. శ్రీనివాసులు కోరారు. జీఎస్టీ అమలు వల్ల పారదర్శకత పెరిగిందని, వ్యాపార రంగంలో విశ్వాసం నెలకొన్నదని. "ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయి. ప్రతి కుటుంబం ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను తెలుసుకొని



ఉపయోగించుకోవాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు

# మంత్రి నారా లోకేష్ సహకారంతో 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ

- స్త్రీ శక్తి సంక్షేమం పేరుతో మహిళలకు ఉచితంగా శిక్షణ, కుట్టు మిషన్లు అందిస్తున్న మంత్రి నారా లోకేష్
-శిక్షణ పొందిన "72"వ బ్యాచ్ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ
-కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేసిన నియోజకవర్గ తెలుగు మహిళలు



**మంగళగిరి అక్టోబర్ 10 ( లక్ష్యం న్యూస్ ప్రతినిధి)**
మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా తాడేపల్లి పట్టణం, తాడేపల్లి రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు శుక్రవారం ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. 72వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు అందజేశారు. మంత్రి నారా లోకేష్ లబ్దిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి నారా లోకేష్‌కు ఎంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మీ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలో మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు కుట్టు మిషన్ల ద్వారా తమ కుటుంబ జీవనోపాదులను పెంచుకోవాలన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, స్వయం సహాయక సంఘాలను బ్యాంకు లింకేజీ, రుణాలు, మహిళల పేరిట ఇల్లు, తల్లికి వందనం వంటి వాటిని అమలు చేస్తూ మహిళలకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నది కేవలం కూటమి ప్రభుత్వం మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, తాడేపల్లి పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నే కుసుమ, తాడేపల్లి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బొర్రా కృష్ణ వందన, తాడేపల్లి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూర మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలి

**నరసరావుపేట అక్టోబర్ 10 (లక్ష్యం న్యూస్)::**
ఈరోజు నరసరావుపేట స్థానిక పెద్ద చెరువు బీసీ సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా కార్యాలయం నందు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బాగున్నల శ్రీను, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కులగనాన చేసి వారి సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులను సర్వే ద్వారా నివేదిక తెప్పించుకొని 57.6% బీసీలు ఉన్నట్లుగా నివేదిక అందినది,తెలంగాణ అసెంబ్లీ ఉభయ సభలో ఆమోదింపజేసి జీవో నెంబర్ 9 ద్వారా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42% శాతం రిజర్వేషన్ అమలు చేసే విధానంలో ముందుకు వెళ్తుంటే, స్థానిక సంస్థల ఎన్నికలు ఆపాలని అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అడ్డుకోవాలని, కొంతమంది రాజకీయ పార్టీలు, ఉభయ సభలలో ప్రత్యక్షంగా ఆమోదం తెలిపి పరోక్షంగా, రాజకీయ పార్టీలు మరియు న్యాయవాదులు ద్వారా హైకోర్టులో 23 పైగా పిటిషన్లు వేసి, బీసీలకు రావలసిన 42 శాతం రిజర్వేషన్ను అడ్డుకునే ప్రయత్నం జరిగింది, దీన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం పూర్తిస్థాయిలో ఖండిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో 55 శాతం పైగా ఉన్న బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాలలో, రావలసిన రిజర్వేషన్ ఫలాలను, రెండు తెలుగు రాష్ట్రాలలో ఏ




రాజకీయ పార్టీలు అడ్డుకున్న కూడా ఆ రాజకీయ పార్టీలు బీసీ ద్రోహులుగా మిగిలిపోతారు అని, రానున్న రోజుల్లో ఆ పార్టీ లకు, మనుగడ, పుట్ట గతులు, కూడా ఉండకుండా బీసీలు ఓటు బ్యాంకు ద్వారా బుద్ధి చెబుతారు, కావున గౌరవ హైకోర్టు వారు బీసీలకు రావాల్సిన 42% శాతం రిజర్వేషన్ అమలయ్యే విధంగా తీర్పు ఇవ్వాలని కోరుతున్నాము, మరియు ఆంధ్రప్రదేశ్లో కూడా 2026 జనవరిలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా కుల జన గణన చేపట్టాలని, బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసినారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగారపు గురు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు సరికొండ తిమ్మరాజు, యువజన అధ్యక్షులు సుతారం విశ్వేశ్వరరావు, కృష్ణ బలిజ సంఘం నాయకులు, అధ్యక్షులు మామిడాల గిరిబాబు, అన్నం శ్రీనివాసరావు, బత్తుల వీర వెంకట రాజశేఖర్, రిటైర్డ్ టీచర్ అమరోజు వెంకటేశ్వర్లు, యువజన నాయకులు దమ్మాటి మల్లికార్జునరావు తన్నీరు వెంకటేశ్వర్లు, మీరంపల్లి శ్రీనివాసరావు, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# మత్తుమందు నుండి యువతను కాపాడుదాం అర్బన్ సిఐపి రమేష్

## మత్తు మందుల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**చిలకలూరిపేట అక్టోబర్ 10 లక్ష్యం న్యూస్**
యువతను మత్తు మందుల బారి నుండి రక్షించాలనే లక్ష్యంతో చిలకలూరిపేట పట్టణంలో విస్తృత అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక శారదా స్కూల్ నందు చిలకలూరిపేట పట్టణ సీఐ రమేష్ సారథ్యంలో, అసిస్ట్ సంస్థ సహకారంతో "మత్తు మందు నుండి యువతను కాపాడుదాం" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ విద్యార్థులతో మాట్లాడారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నేటి సమాజంలో, ముఖ్యంగా ధనిక కుటుంబాలలో, "క్లబ్ కల్చర్" పేరుతో యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ తీసుకోవడం కేవలం వ్యక్తిగత సమస్యే కాదని, అది వారి కుటుంబాలను, సమాజాన్ని కూడా నాశనం చేస్తుందని స్పష్టం చేశారు.డ్రగ్స్ నివారణకు ప్రత్యేక చర్యలు(డ్రగ్స్ నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని సీఐ రమేష్ తెలిపారు. డ్రగ్స్ నిరోధక చర్యల కోసం 'ఈగల్ అనే ప్రత్యేక విభాగాన్ని



ఏర్పాటు చేసినట్లు విద్యార్థులకు తెలియజేశారు.డ్రగ్స్ తీసుకునేవారు ఎక్కడైనా కనిపించినా, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని విద్యార్థులను కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1972 ను గుర్తు చేశారు. ఎవరైనా డ్రగ్స్ కనిపిస్తే, ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లయితే వెంటనే 1972 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో శారదా స్కూల్‌కు చెందిన బాలురు, బాలికలు సంఖ్యలో పాల్గొన్నారు.

# జస్టిస్ గవాయి పై దాడి బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాదానికి నిదర్శనం

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**
దేశ అత్యున్నత న్యాయాధికారి అయిన జస్టిస్ గవాయి పై చెప్పులతో జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది, ఈ చర్య బిజెపి, ఆర్ఎస్ఎస్ ల వికృత మతోన్మాదానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దాడి చేసిన వారిపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోపోవటం, దేశంలో దళితుల పట్ల బిజెపి, ఆర్ఎస్ఎస్ ల తీరు మరో సారి స్పష్టమైందన్నారు. బిజెపి ఆర్ఎస్ఎస్ రెండు నాలుకల ధోరణిని మార్చుకొని, దళితుల భద్రత కొరకు సరైన చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం అని రామచంద్రారెడ్డి అన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి

సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గాదె పుల్లారెడ్డి, వంగపాటి నాగరాజు, దొడ్డ శ్రీనివాసరావు, కొమ్ము కోటేశ్వరరావు, షకీర్ అలీ, నాజర్ వలి, ఆదాం, నాయక్, బ్రహ్మారెడ్డి, గాలం అంజి పాల్గొన్నారు.


## చిలకలూరిపేట పట్టణం లో డ్రైనేజీ కష్టాలు..

# వర్షానికి రోడ్లపైకి మురుగు, విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం!

**చిలకలూరిపేటఅక్టోబర్ 10 లక్ష్యం న్యూస్**
పట్టణం లో కురిసిన వర్షానికి విజయ బ్యాంక్ పక్కన రోడ్డులో తీవ్రమైన డ్రైనేజీ సమస్య తలెత్తింది. ముఖ్యంగా ఆదిత్య కంటి ఆసుపత్రి ఎదురుగా ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, నీరు పోయే మార్గం అస్తవ్యస్తంగా మారడంతో, వర్షపు నీటితో కలిసి మురుగు నీరు రోడ్డుపైకి ఉప్పొంగి పారుతోంది.

### విద్యార్థులకు, స్థానికులకు ఇబ్బందులు..

ఈ ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో విద్యా సంస్థలు, వైద్యశాలలు ఉండటంతో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పారుతున్న మురుగునీటి గుండానే విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కలుషిత నీటిలో నడవడం వల్ల అనారోగ్యాలు, అంటువ్యాధులు ప్రబలే



ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### స్థానికుల ఆరోపణలు..

"డ్రైనేజీని సరిగ్గా శుభ్రం చేయకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం," అని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి, మురుగునీరు పోవడానికి దారి లేక రోడ్డు మీదికి ప్రవహిస్తోందని వారు తెలిపారు.



పారిశుద్ధ్య లోపం కారణంగా పట్టణ ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి, ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని చిలకలూరిపేట ప్రజలు కోరుతున్నారు.

# పేటలో బాణసంచా షాపుల్లో ప్రమాదాలు జరగకుండా

# జాగ్రత్తలు తీసుకోండి

### అమ్మే ధరలపై అధికారులు చర్యలు తీసుకోండి
### నిబంధనల ప్రకారం షాపులు ఉన్నాయా
### అడ్వకేట్ మాదాసు భాను ప్రసాద్.

**చిలకలూరిపేటఅక్టోబర్ 10 లక్ష్యం న్యూస్**
అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. ప్రతి సంవత్సరం ఎక్కడో ఒకచోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ కోరారు. ప్రభుత్వం కోనసీమ



జిల్లాలో జరిగిన ప్రమాదంపై కమిటీని వేయడమే కాకుండా నివేదిక ఆధారంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని భాను ప్రసాద్ కోరారు. చిలకలూరిపేట పట్టణంలో నేషనల్ హైవే పై ఏర్పాటుచేసిన బాణసంచా విక్రయ కేంద్రాలలో భద్రతా నిబంధనలు అమలు జరిగేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. చిలకలూరిపేట పట్టణం బాణసంచా విక్రయాలలో రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి.. ఇక్కడ పెద్ద ఎత్తున అమ్మకాలు జరుగుతాయనేది జగమెరిగిన సత్యం, బాణసంచా విక్రయదారులు తీసుకునే లైసెన్సులు, అమ్మే సరుకుకు వాటి రేట్లకు ఏమాత్రం పొంతన ఉండటం లేదని సంబంధిత అధికారులు స్పందించి రేట్ల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# తెలంగాణ హైకోర్టు జీవో నెంబర్ 9 పై ఇచిన స్టే అన్యాయం అని

## ఎపిసిసి ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శొంఠి నాగరాజు ఆగ్రహం

**విజయవాడ అక్టోబర్ 10(లక్ష్యం న్యూస్):::**
ఆంధ్రప్రదేశ్ ఓబీసీ కాంగ్రెస్ స్టేట్ చైర్మన్ శొంఠి నాగరాజు గారు తీవ్రంగా స్పందిస్తూ తెలిపారు
జీవో నెంబర్ 9 పైన హైకోర్టు స్టే విధించడం బీసీల హక్కులపై మరొక చరిత్రాత్మక దెబ్బ అని అన్నారు. రాష్ట్రంలో గాని దేశంలో గాని బీసీలకు తరచుగా జరిగే అన్యాయాలకు ప్రధాన కారణం న్యాయవ్యవస్థలో బీసీ జడ్జిలు లేకపోవడమేనని ఆయన స్పష్టం చేశారు. దేశంలో మొత్తం జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీ వర్గాలకు కనీస గౌరవం, ఆత్మగౌరవం, హక్కులు ఇవ్వకుండా మూడు నాలుగు శాతం ఉన్న వర్గాలకు మాత్రం 15 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించడం విచిత్రమని మండిపడ్డారు. ఇంత భారీగా ప్రజాసంఖ్య కలిగిన బీసీలకు మాత్రం కనీస రిజర్వేషన్ హక్కు ఇవ్వడంలో కేంద్రం గాని, రాష్ట్ర ప్రభుత్వాలు గాని విఫలమయ్యాయని, ఇదే సామాజిక అసమానతను బలపరుస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగరాజు గారు పేర్కొంటూ - తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా తీసుకొచ్చిన జీవో నెంబర్ 9 ప్రజాస్వామ్యానికి న్యాయం చేసే గొప్ప నిర్ణయం అని అన్నారు. కానీ ఆ జీవోపై హైకోర్టు స్టే విధించడం చాలా ఆశ్చర్యకరమని, ఈ స్టే వెనుక కూడా సామాజిక అసమానతలు దాగి ఉన్నాయని పేర్కొన్నారు. హైకోర్టు మరియు సుప్రీంకోర్టులలో ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాలకు చెందిన న్యాయమూర్తులు సరిపడా లేకపోవడమే కారణంగా ఇలాంటి నిర్ణయాలు వస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. "హైకోర్టులో ఎస్సీ, బీసీ జడ్జిలు ఉంటే, జీవో నెంబర్ 9 లాంటి సామాజిక న్యాయ నిర్ణయాలకు ఎప్పటికీ స్టే వచ్చేది కాదు. కానీ కొలీజియం సిస్టమ్‌లో ఉన్న అగ్రవర్ణ ఆధిపత్యం వల్లే బీసీల హక్కులు ఎప్పటికీ కాగితాలపై మాత్రమే మిగిలిపోతున్నాయి" అని శొంఠి నాగరాజు గారు వ్యాఖ్యానించారు.తదుపరి మాట్లాడుతూ, "కొలీజియం ద్వారా వస్తున్న న్యాయమూర్తుల ఎంపికలో కూడా అగ్రవర్ణాల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. అదే కారణంగా బీసీలకు న్యాయం జరగడం లేదు. బీసీలు న్యాయవ్యవస్థలో భాగం కాకపోతే, బీసీలకు న్యాయం ఎలా జరుగుతుంది? ఇది ఒక మూలపూర్వక వ్యవస్థలోని లోపం" అని ఆయన పేర్కొన్నారు. "ఈ దేశంలో బీసీలు న్యాయస్థానాల్లో, పరిపాలనలో, చట్టసభల్లో, కార్యనిర్వాహక వ్యవస్థల్లో సరియైన స్థానం పొందే వరకు నిజమైన సామాజిక న్యాయం సాధ్యం కాదు. బీసీలకు న్యాయం కావాలంటే న్యాయవ్యవస్థలోనూ బీసీలకు చోటు ఉండాలి, జడ్జిలుగా అవకాశం ఉండాలి." "ఇప్పుడు బీసీల నోటికి అందిన మొద్దను లాగేసే ప్రయత్నం రెడ్డి వర్గాలు చేస్తున్నాయి. బీసీలను ఎప్పటికీ వెనక్కి నెట్టే ఈ రాజకీయ కుట్రలను కాంగ్రెస్ పార్టీ అసలు సహించదు. బీసీల



ఆత్మగౌరవం కోసం, రిజర్వేషన్ హక్కుల కోసం అవసరమైతే న్యాయపోరాటం నుంచి రోడ్లపై పోరాటం వరకు మేము సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. "ఈ దేశంలో న్యాయం అనే పదానికి అర్థం రావాలంటే, ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాలకు చెందిన న్యాయమూర్తులు తప్పనిసరిగా ఉండాలి. అప్పుడు మాత్రమే జీవో నెంబర్ 9 లాంటి సామాజిక న్యాయ నిర్ణయాలు నిలుస్తాయ "బీసీలపై జరుగుతున్న అన్యాయం ఇక మేము సహించము. సామాజిక న్యాయం కోసం, బీసీ గౌరవం కోసం మేము నిరంతరం పోరాటం కొనసాగిస్తాము. ఈ దేశ న్యాయవ్యవస్థలోనూ బీసీ భాగస్వామ్యం తప్పనిసరి కావాలి."

# సామాన్యుని నుండి అసమాన శక్తిగా నారా చంద్రబాబు

# నాయుడు 15 ఏళ్ళ ముఖ్యమంత్రిగా జైత్ర యాత్ర

**గుంటూరు అక్టోబర్ 10 (లక్ష్యం న్యూస్ )::**
సామాన్యునిగా రాజకీయాల్లోకి వచ్చి సంక్షోభాలను ఎదుర్కొని ముందుచూపు అభివృద్ధి సంక్షేమాలను చిరునామాగా మార్చుకొని ముఖ్యమంత్రిగా 15 ఏళ్ళ జైత్ర యాత్ర చేసిన స్పూర్తి ప్రదాత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి హార్దిక శుభాకాంక్షలు హైదరాబాదును సైబరాబాద్‌గా మార్చి, ఐటీ హబ్‌గా అభివృద్ధి చేశారు. HITEC City, Cyber Towers, Genome Valley, Outer Ring Road వంటి ప్రాజెక్టులు ఆయన విజన్ ఫలితం. Microsoft, Infosys, Wipro, Google వంటి దిగ్గజ కంపెనీలను ఆహ్వానించి యువతకు వేలాది ఉద్యోగాల అవకాశాలు కల్పించారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో ప్రజా భాగస్వామ్య అభివృద్ధి ప్రారంభించారు. ఇంకుడు గుంటలు ,వర్షాజల సేకరణ, మైక్రో ఇరిగేషన్ పద్ధతులు ప్రవేశపెట్టి నీటి యాజమాన్యంలో కొత్త దారులు చూపారు. రైతులకు రైతు బజార్‌లు, e-Seva సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చి, వ్యవసాయ యాంత్రీకరణ, సాంకేతికతతో ముడివేశారు పరిపాలనలో పారదర్శకత సాంకేతికతకు నాంది పలికారు. e-Governance, రియల్ టైమ్ గవర్నెన్స్, CM డాష్‌బోర్డ్ వంటి వ్యవస్థల ద్వారా ప్రతి శాఖపై ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు. అధికారుల పనితీరుకు బాధ్యతను నిర్ధారించే విధానాలు అమలు చేశారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో విశేష ప్రగతి సాధించారు. హైదరాబాదు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రణాళిక ఆయన కాలంలోనే ప్రారంభమైంది. అమరావతి రాజధాని నగర రూపకల్పనకు బ్లూప్రింట్ సిద్ధం చేశారు. రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయాలు ప్రతి జిల్లాలో విస్తరించారు. విద్య, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్కిల్ డెవలప్మెంట్ యూనివర్శిటీ, APSSDC ద్వారా యువతకు ఉపాధి అవకాశాల కోసం శిక్షణ అందించారు. ఇంగ్లీష్ మాధ్యమ పాఠశాలలు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, వర్చువల్ లెర్నింగ్ పద్ధతులు ప్రవేశపెట్టారు. పెట్టుబడులు ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్‌ను ముందు వరుసలో నిలిపారు. CII Partnership Summits ద్వారా దేశ, విదేశ పెట్టుబడులను తీసుకొచ్చారు. Kia Motors, Amaravati Start-up Zone, Google Fiber Project వంటి ప్రాజెక్టులను ప్రారంభించారు. Vision 2020 ద్వారా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పరిశ్రమ, సాంకేతిక రంగాలలో



దీర్ఘకాల ప్రణాళికను రూపొందించారు. ప్రజా సేవలకు ఆకస్మిక తనికీలు, ప్రజల వద్దకు పాలన, మీ సేవ వంటి పారదర్శక వ్యవస్థలను ప్రవేశపెట్టారు. లంచం రహిత పరిపాలనకు మార్గం సుగమం చేశారు. జాతీయ స్థాయిలో అనేక సార్లు ఉత్తమ ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు. ప్రపంచ ఆర్థిక వేదిక Davos కు ఆహ్వానించబడిన తొలి భారతీయ ముఖ్యమంత్రి కావడం ఆయన నాయకత్వ ప్రతిభకు నిదర్శనం. నారా చంద్రబాబు గారి నాటి స్వప్నం విజన్ 2020 నిజమైంది, నేడు విజన్ 2047 కి శరవేగంగా అడుగులు పడుతున్నాయి.

## స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు థీమ్ - 5 క్లీన్ - గ్రీన్ విలేజ్ RGSA 2025-2026 పై అన్ని గ్రామల పంచాయతీ సర్పంచ్ లకు, ఉప సర్పంచ్ లకు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకుమూడు రోజులు శిక్షణ కార్యక్రమము





**కొల్లిపర అక్టోబర్ 10 (లక్ష్యం న్యూస్)**
ఈ రోజు మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు మండలము లోని అన్ని గ్రామాల పంచాయతీ సర్పంచ్ లకు, ఉప సర్పంచ్ లకు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు 'Capacity Building Training under LSDGs - Theme 5 Clean & Green under RGSA 2025-26" మొదలగు అంశములు పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమము లో భాగముగా మొదటి రోజు శిక్షణ కార్యక్రమము ఉదయం 10.00 లకు కొల్లిపర మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు శ్రీమతి భీమవరపు పద్మావతి సంజీవ రెడ్డి ప్రారంభించినారు. సదరు కార్యక్రమనకు MPDO వి.విజయ లక్ష్మి, Dy.MPDO సిహెచ్.భార్గవ శిక్షణ కార్యక్రమము లో పలు అంశాలు వివరించడం జరిగినది, మరియు సదరు మొదటి రోజు శిక్షణ కార్యక్రమముకు MOT గా శ్రీ కె.శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి వ్యవహరించడ జరిగినది.

# ఐటీ విద్యా శాఖా మంత్రి స్థానిక శాసనసభ్యులు

## నారా లోకేష్ ఆదేశాల మేరకు

### పెదవడ్లపూడి గ్రామంలో ఐదుగురికి 2,89,294/- విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
### బాధితుల ఇంటికి వెళ్లి చెక్కులు పంపిణీ చేసిన టిడిపి నాయకులు



**మంగళగిరి అక్టోబర్ 10 ( లక్ష్యం న్యూస్ ప్రతినిధి)**
ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం టిడిపి నాయకులు బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో పోతురాజు పార్వతి- 1,21,226,సయ్యద్ నూర్జ.-25,541,లింగినేని నందిని -20,464,పరుచూరి పద్మావతి -45,000 షేక్ జాన్ బాషా -77,063, విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను, మొత్తం ఐదుగురికి 2,89,294/-,రూ విలువైన చెక్కులను మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ చేతుల మీద గా అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు రావడానికి కృషిచేసిన మంత్రి నారా లోకేష్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమం లో టిడిపి నాయకులు మాదల రమేష్ బాబు, నడపన దుర్గారావు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, ఉల్లంగి శ్రీనివాసరావు,కంచర్ల బద్రి, శరణు విష్ణు, కొప్పాక ఓంకార్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## భారతి హాస్పటల్లో రోగులకు జీఎస్టీ పై అవగాహన సదస్సు



**నరసరావుపేట అక్టోబర్ 10 (లక్ష్యం న్యూస్)::**
పల్నాడు జిల్లా నరసరావుపేట అరండల్ పేట భారతి ఆసుపత్రిలో రోగులు, సిబ్బందికి జీఎస్టీపై డా. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యశాఖకు సంబంధించిన పలు ఉపయోగాలు, తాజా జీఎస్టీ మార్పుల గురించి ప్రజలకు వివరించారు. ప్రాణరక్షక మందులపై జీఎస్టీ 0%, అలాగే టెస్టింగ్ కిట్లు మరియు వైద్య ఆక్సిజన్‌పై 5%కి తగ్గించబడిందని తెలిపారు. ఆరోగ్య సేవలకు సంబంధించిన పన్ను రాయితీల వల్ల సాధారణ ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఆయన అన్నారు.

## విద్యార్థుల సమస్యను పరిష్కరించిన అధికారులు

**నాదెండ్ల అక్టోబర్ 10 లక్ష్యం న్యూస్**
పాఠశాలకు వెళ్లే దారిలో పిచ్చి కంప చెట్లు, వ్యర్థాల వల్ల వచ్చే దుర్గంధంతో విద్యార్థులు పడే ఇబ్బందులను గమనించి గ్రామ నివాసి, ఎస్సీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ నాగండ్ల వీరయ్య, బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ లో ఎంపీడీవో కు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యపై ఎంపీడీవో, గ్రామ




పంచాయతీ సెక్రెటరీ స్పందించి దారికి ఇరువైపులా ఉన్న పిచ్చి కంప చెట్లను తొలగించి వ్యర్థాలను తీసివేసి ట్రాక్టర్ తోటి ముందు పిచికారి చేయడం జరిగింది.సమస్యను త్వరగా పరిష్కరించినందుకు గ్రామ ప్రజల తరఫున మండల ఎంపీడీవో, పంచాయితీసెక్రటరీకి ఎస్సీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ నాగళ్ళ వీరయ్య, నాదెండ్ల మండల మాజీ అధ్యక్షులు ఆలా శివకోటిరెడ్డి ,నాతోని రామకృష్ణయ్య చేకూరి అన్నపూర్ణమ్మ ,రంగారావు తదితరులు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎన్నారై కృష్ణ ప్రసాద్ సేవలు అభినందనీయం

## డాక్టర్ కేపీ చారి



రోగులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :** ఎక్కడో విదేశాల్లో స్థిరపడినా, పుట్టి పెరిగిన ప్రాంతాన్ని మర్చిపోకుండా స్నేహితుల ద్వారా ఇక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని ప్రభుత్వ వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ కెపి చారి అన్నారు. ఎన్ఆర్ఐ కృష్ణప్రసాద్ మనవడు వియాన్‌శేఖర్ పుట్టినరోజును పరస్కరించుకొని ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడుతూ మాచర్ల పట్టణానికి చెందిన కృష్ణ ప్రసాద్ అమెరికాలో స్థిరపడి, వారి మనవడు వియాన్ శేఖర్ పుట్టినరోజు సందర్భంగా, మాచర్లలో వుంటున్న స్నేహితులు ద్వారా ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు చుట్టుపక్కల గ్రామాల నుండి ఎంతోమంది వైద్య సహాయం కోసం అధికంగా పేదలు వస్తారని, ఇలా సేవా కార్యక్రమాలు ద్వారా వారికి మంచి భోజనం అందించటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు గాడిపర్తి శ్రీనివాసరావు, ప్రజాశక్తి రమేష్, ఉప్పు ప్రసాదు, విలేకరులు చంద్రారెడ్డి శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, వాసు, ప్రజానాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

## రాజబోయిన మల్లేశ్వరిమధుయాదవ్



**మాచర్ల రూరల్ :అక్టోబర్ 10: లక్ష్యం** మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి, స్థానిక రైతుల సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తామని మార్కెట్ యార్డు ఛైర్మన్ రాజబోయిన మల్లేశ్వరి,మధు యాదవ్ అన్నారు. ఏపీ మార్కెటింగ్ వ్యవసాయ శాఖ కమిషనర్ విజయ సునీత ని మర్యాదపూర్వకంగా కలిసి, యార్డు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా చైర్మన్ మల్లేశ్వరి మధు యాదవ్ మాట్లాడుతూ మార్కెట్ యార్డులో రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల కు సరైన ధర లభించేలా చూడడం, మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపరచడం వంటి అంశాలపై దృష్టి సారించినున్నట్టు తెలిపారు. ముఖ్యంగా రైతులు తమ పంటను నిల్వ ఉంచుకోవడానికి సరిపడా గోదాములు నిర్మించడం, వేలం పాటల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం వంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. కమిషనర్ విజయ సునీత మాచర్ల మార్కెట్ యార్డు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు మల్లేశ్వరి మధు యాదవ్ వివరించారు. ఈ సమావేశంలో రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కమిషనర్ వివరించినట్లు తెలిపారు. మార్కెట్ యార్డులో జరుగుతున్న పనుల గురించి, రైతుల సమస్యల గురించి కూడా కమిషనర్ తో చర్చించినట్లు ఆమె పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడం లోనూ, యార్డు ను ఆదర్శంగా తీర్చిదిద్దడంలోనూ కమిషనర్ సహకారం ఎంతో అవసరమని చైర్మన్ మల్లేశ్వరి,మధుయాదవ్ ఈ సందర్భంగా తెలిపారు.


# ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా

## ఇర్లపాడులో పర్యటించిన డిఎల్పీఓ




**నాదెండ్లఅక్టోబర్ 10(లక్ష్యం న్యూస్)** మండలంలోని ఇర్లపాడుగ్రామంలోడిఎల్పీఓ వివిఎం లక్ష్మణ రావు పర్యటించారు. పారిశుధ్యం, చెత్త సేకరణలో గ్రామ ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఆయన ఈ పర్యటనను చేపట్టారు. రోజు వారీ చెత్త సేకరణ కార్యక్రమ నిర్వహణపై స్థానిక ప్రజలను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. చెత్త సేకరించే సమయంలోనే తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వాలని స్థానికులకు ఆయన సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన గ్రామస్థులను కోరారు. డిఎల్పీఓ వెంట గ్రామ సర్పంచి గొల్లప్రోలు కోటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి కారసాల మధు బాబు, తదితరులు ఉన్నారు.

# విచారణకు హాజరైన పిన్నెల్లి సోదరులు



పోలీస్ స్టేషన్ నుండి బయటకు వస్తున్న పిన్నెల్లి సోదరులు

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :** వెల్దుర్తి మండలం గుల్లపాడు గ్రామంలో జరిగిన జంట హత్యల కేసులో పోలీసుల ఆదేశాల మేరకు రెండవసారి రూరల్ సర్కిల్ కార్యాలయం నందు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృరెడ్డి, సోదరుడు వెంకట్రామిరెడ్డిలు హాజరైయారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో విచారణకు స్టేషన్‌కు వచ్చారు. సాయంత్రం 6.30గంటల వరకు విచారణ జరిగింది. విచారణ వివరాలేవి తెలియరాలేదు. పిన్నెల్లి సోదరులు విచారణకు వస్తున్న సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుండి పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిసి, వారు రాకుండా పట్టణ శివారు ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసి, పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రూరర్ సర్కిల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున పోలీసు బలగాలను మోహరించారు.

## కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు తాత్కాలిక భవనాలు పరిశీలన



బాయ్స్ హైస్కూల్ ను పరిశీలిస్తున్న అధికారులు

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి** మాచర్ల కు మంజూరు అయిన కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించేందుకు, తాత్కాలిక వసతి కోసం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ గదులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయాలకు చెందిన అసిస్టెంట్ కమీషనర్ బృందంతో స్థానిక తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఎంఈవో అల్లి సురేష్ కలసి తాత్కాలికంగా తరగతులను నిర్వహించేందుకు తగిన సౌకర్యాలను పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి కేంద్రీయ విద్యాలయం నూతన ప్రవేశాలు జరిగే అవకాశాలు వున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# కొత్తపల్లి - విజయపురి సౌత్ రోడ్డుకు రూ. 5 కోట్లు కేటాయింపు - హర్షం వ్యక్తం చేసిన

## జనసేన నాయకులు,న్యాయవాది బత్తుల బాబురావు



**మాచర్ల రూరల్: అక్టోబర్ 10 :( లక్ష్యం)** మాచర్ల నియోజకవర్గంలోని కొత్తపల్లి – విజయపురి సౌత్ రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ. 5 కోట్లు నిధులు కేటాయించడం పై జనసేన నాయకులు, న్యాయవాది బత్తుల బాబురావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అధ్వానంగా మారిన రోడ్ల దుస్థితిని గుర్తు చేస్తూ, కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాథమిక అవసరాలను తీరుస్తోందని కొనియాడారు.

### గత పోరాటాన్ని గుర్తు చేస్తూ..

గత ఎన్నికల ముందు, ఈ రోడ్డు దుస్థితి పై జనసేన పార్టీ ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన తెలిపిన విషయం సుపరిచితమే. రోడ్డుపై గుంతల్లో నిల్వ ఉన్న నీటిలో వరి నాట్లు వేసి అప్పటి రోడ్ల అధ్వానపరిస్థితిని ప్రజలకు తెలియజేశారు. ఆ సందర్భంగా, ప్రస్తుత ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పాడైపోయిన రోడ్లన్నిటినీ బాగు చేస్తామని ప్రజలకు వాగ్దానం చేశారు.

### ఉపముఖ్యమంత్రి చొరవతో..

మహాత్మా గాంధీ కలగన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలు చేస్తూ, పల్లెటూర్లు బాగుంటే దేశం బాగున్నట్లే అన్న గాంధీజీ ఆశయాన్ని కూటమి ప్రభుత్వం నిజం చేస్తోందని ప్రముఖ న్యాయవాది బత్తుల బాబురావు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రజల అవసరాలను, ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిందని, ఏ రోడ్డు చూసినా గుంతల మయంగా మారిందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా మాచర్ల నియోజకవర్గంలో కారంపూడి – మాచర్ల రోడ్డుతో పాటు కొత్తపల్లి – విజయపురి సౌత్ రోడ్డు సర్వనాశనం అయ్యాయని, కనీసం గుంతల్లో గంపెడు మట్టి కూడా వేయని గత ప్రభుత్వ వైఖరిని ఎద్దేవా చేశారు.

### యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

పరిపాలన అంటే ఏమిటో కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తోందని, గత చేతగాని ప్రభుత్వానికి ఇది చెంపపెట్టు లాంటిదని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రంలో గ్రామాలకు వెళ్లే రోడ్లను ఒక్కొక్కటిగా సరిచేస్తోంది. మాచర్ల నియోజకవర్గంలో ఇప్పటికే కారంపూడి – మాచర్ల రోడ్డును సరిచేయగా, ఇప్పుడు కొత్తపల్లి – విజయపురి సౌత్ రోడ్డును సరిచేసే పనిలో భాగంగా రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషదాయకమని తెలిపారు. ఈ నిధుల కేటాయింపుతో కొత్తపల్లి నుండి విజయపురి సౌత్ మధ్య గ్రామాల ప్రజల ప్రాథమిక అవసరం తీరినట్టేనని, ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వానికి, ముఖ్యంగా జనసేనాని, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మాచర్ల పట్టణ జనసేన నాయకులు, న్యాయవాది బత్తుల బాబురావు పేర్కొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 'ప్రజా ఉద్యమం' పోస్టర్లు ఆవిష్కరణ.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పిన్నెల్లి తదితరులు

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :** మాచర్ల పట్టణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు శుక్రవారం వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోటి సంతకాల సేకరణ పోస్టర్ 'ప్రజా ఉద్యమం' ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజ్ లను పీపీపీ కి ఇవ్వటాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని కోరుతూ కోటి సంతకాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ఉద్యమానికి ప్రతి ఒక్కరు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పోలా శ్రీనివాసరావు, షేక్ జలీల్, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, చల్లా శ్రీను, బూడిద శీను, మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, మాచర్ల మండలాల్లోని నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నరసరావుపేటలో 200 టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు స్వాధీనం కోసం సిద్ధం

## ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కృషి ఫలితం




**నరసరావుపేట అక్టోబరు 10 (లక్ష్యం న్యూస్)** నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 200 టిడ్కో ఇళ్లు అన్ని సౌకర్యాలతో నిర్మాణం పూర్తి చేసుకొని, లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. అక్టోబరు 23 నాటికి 200కు పైగా ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు కీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా నిలిచారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో కలిసి టిడ్కో హౌసింగ్ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా, కాలనీలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి, నివాసం ఉంటున్న లబ్ధిదారులతో సమస్యల గురించి చర్చించారు. వీధి దీపాల మరమ్మతులు, రహదారులు, మురుగు కాలవలు, కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు వంటి సమస్యలను స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహసీల్దార్, పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో రాష్ట్రంలో టిడ్కో కాలనీలను సకల సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ లక్ష్య సాధనలో అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరలోనే ఇళ్ల స్వాధీనం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు కేసుల్లో పెండింగ్‌లో ఉన్న 270 ఇళ్ల విషయంలో త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, రుణాలు మంజూరు కాని 300 మందికి పైగా లబ్ధిదారుల కోసం బ్యాంకులతో క్యాంపులు ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయించి ఇళ్లు అప్పగిస్తామని తెలిపారు. సేల్ డీడ్ రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అక్టోబరు 23 నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. టిడ్కో కాలనీలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయని, లబ్ధిదారులకు అన్ని వసతులు అందుతున్న తీరు ఆనందం కలిగిస్తోందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, తహసీల్దార్ వేణుగోపాల్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బరాయ గుప్తా తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ చదలవాడ అరవింద బాబు నాయకత్వంలో నరసరావుపేట టిడ్కో కాలనీ అభివృద్ధి మరింత వేగవంతం కానుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉత్కంఠ భరతంగా రాష్ట్రస్థాయి పోటీలు ..



**గుంటూరు అక్టోబర్ 10 (లక్ష్యం న్యూస్)**

ఉత్కంఠ భరితంగా రాష్ట్రస్థాయి ఈతల పోటీలు ఈత పోటీల ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం పెంపొందుతాయని హైకోర్టు న్యాయమూర్తి హరినాథ్ అన్నారు శుక్రవారం శ్యామల నగర్ లోని స్విమ్మింగ్ పూల్ లో జరిగిన రాష్ట్రస్థాయి ఈత పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు ప్రధానం చేశారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది రమణారావు, కార్యదర్శి మర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది రమణ రావు కార్యదర్శి, మర్రి సత్యనారాయణ తో కలిసి మాట్లాడారు. గత ఎనిమిదేళ్లుగా స్విమ్మింగ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి క్రీడాకారులు హాజరైనట్లు వెల్లడించారు. కేటగిరిలలో పోటీలు జరిగాయి. ఉదయం ప్రారంభమైన పోటీలు ఆయా జిల్లా జట్ల మధ్య హొరాహోరీగా సాగాయి. ప్రత్యర్థి పై పలువురు క్రీడాకారులు విజయం సాధించి ప్రథమ ద్వితీయ తృతీయ నిలిచారు. అనంతరం సాయంత్రం జరిగిన బహుమతుల ప్రధానోత్సవం లో హైకోర్టు న్యాయమూర్తి హరినాథ్ పాల్గొన్నారు. ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు పొందిన పురుష మహిళ స్విమ్మింగ్ దారులకు మెడల్స్ ప్రశంసా పత్రాలు అందజేశారు ఈత పోటీలు నిర్వహించడం హర్షదాయకమన్నారు ఈత వంటి క్రీడల ద్వారా ప్రతి ఒక్కరూ శారీరక మానసిక ఆరోగ్యం పొందటమే పొందవచ్చు అన్నారు

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :** మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని రెండవ శనివారము 11కెవి ల్కెన్లో ట్రీ బ్రాంచెస్ కటింగ్, ల్కెన్స్ మెయింటినెన్స్ ఉన్నందువలన, మాచర్ల టౌన్ లోని 33/11కెవి సిద్ధగుంతల, 33/11 కెవి రింగ్ రోడ్డు, 33/11కెవి రైట్ కెనాల్ సబ్ స్టేషన్లలో కరెంటు సరఫరా ఉదయం 08.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓఎస్టి ఏ. రామయ్య తెలిపారు. అదేవిధంగా 33 కెవి ల్కెన్ల మరమ్మత్తులు, మెయింటినెన్స్ , ట్రీ బ్రాంచెస్ కటింగ్ కోసం 33కెవి మాచర్ల మండలం అనుపు, కొప్పునూరు ఫీడర్స్ ఉదయం 08.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. వెల్దుర్తి మండలం 132/33కెవి గుండ్లపాడు సబ్‌స్టేషన్ నుండి 33 కెవి వెల్దుర్తి ఫీడర్ను ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని తెలియజేశారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో ని వినియోగదారులు ఈ విషయం గమనించి విద్యుత్ సంస్థకు సహకరించవలసిందిగా కోరారు.

# దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుంది మిథున్ రెడ్డి లేఖ

## టీడీపీ సీనియర్ నేత , పొన్నూరు శాసన సభ్యుడు ధూళిపాళ్ళ



**గుంటూరు అక్టోబర్ 10( లక్ష్యం న్యూస్ )::** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌ను తలదన్నిన స్కామ్ ఆంధ్రాలో వైసిపి లిక్కర్ స్కామ్! దేశం దృష్టిని ఆకర్షించిన ?3500 కోట్ల భారీ లిక్కర్ స్కామ్ నిందితుడు మిథున్ రెడ్డి! “లిక్కర్ కింగ్” మిథున్ రెడ్డి లిక్కర్ మాఫియా మీద లేఖ రాయడం హాస్యాస్పదం! కల్తీ మద్యానికి ఆద్యం పోసింది వైసిపి ఘనులే! పేదల ఆరోగ్యం బలి తీసుకుని సంపదను తన కంపెనీలకు మళ్లించిన ఘనులే లేఖలు రాయడం “దెయ్యాలు వేదాలు వల్లించడమే” వైసిపి హయాంలో జంగారెడ్డిగూడెం విష మద్యం ఘటనలో 16 మంది మృతి.. కనీసం పరామర్శించని వైసిపి నాయకత్వం! జగన్ మోహన్ రెడ్డి అనుయాయుల ధన దాహానికి వేలాది పేద కుటుంబాలు సమిధులయ్యాయి గత ప్రభుత్వం హయాంలో జరిగిన 3500 కోట్ల లిక్కర్ స్కామ్‌పై మిథున్ రెడ్డి సీబీఐ దర్యాప్తు కోరుతూ ఉత్తరం రాయాలని డిమాండ్ చేస్తున్నా..

# జోర్డాన్ లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులను వెంటనే స్వదేశానికి తీసుకురావాలి

- 22 నెలలు గడిచినా కాంగ్రెస్ గల్ఫ్ పాలసీ, ఎన్నారై పాలసీకి అతి గతి లేదు
- కనీసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటుకు దిక్కులేదు
- హరీష్ రావు

**హైదరాబాద్ (లక్ష్యం న్యూస్)**
జోర్డాన్ లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులను వెంటనే స్వదేశానికి తీసుకురావాలి. 22 నెలలు గడిచినా కాంగ్రెస్ గల్ఫ్ పాలసీ, ఎన్నారై పాలసీకి అతి గతి లేదు. కనీసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటుకు దిక్కులేదని మా జీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు, బిఆర్ఎస్ పాలనలో వలసలు వాపస్, కాంగ్రెస్ పాలనలో వలసలు మొదలు అయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు జోర్డాన్ లో చిక్కుకున్న 12 మంది గల్ఫ్ కార్మికులను వెనక్కి రప్పించాలని అయన అన్నారు.
ఉపాధి కోసం వెళ్లి జోర్డాన్ లో చిక్కుకున్న 12 మంది వలస కార్మికుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, గల్ఫ్ బాధితులకు భరోసా ఇవ్వాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తుండటం సిగ్గుచేటు. నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన గల్ఫ్ కార్మికులు దేశం కాని దేశంలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. అక్కడే ఉండి బతికేందుకు చేతిలో డబ్బులు లేక, కంపెనీ అనుమతి ఇవ్వకపోవడంతో తిరిగి స్వదేశానికి రాలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేదా? బిఆర్ఎస్ పాలనలో వలసలు వాపస్ అయితే, ఇప్పుడు వలసలు మల్లా మొదలయ్యాయి. కాంగ్రెస్ పాలనలో ఉపాధి, ఉద్యోగాలు కరువై ఎడారి ప్రాంతాలకు వలస పట్టే దుస్థితి వచ్చింది. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లే.. కాంగ్రెస్ పార్టీ వలస కార్మికుల కుటుంబాలను సైతం దారుణంగా వంచించిందని అయన అన్నారు

# జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది

## - జూబ్లీహిల్స్ ఎన్నిక అంజన్ కుమార్ సారధ్యంలో జరుగుతుంది..
## - మాజీ ఎంపి అంజన్ తో మంత్రి పొన్నం భేటీ

**హైదరాబాద్ (లక్ష్యం న్యూస్)**
మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తో సమావేశం అనంతరం మీడియా తో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కి సంబంధించి ఎన్నికల్లో అందరినీ సంప్రదించిన తర్వాతనే అభ్యర్థి ఎంపిక ఉంటుంది. జూబ్లీహిల్స్ లో అంజన్ కుమార్ యాదవ్ పోటీ చేయాలని భావించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ అధిష్టానం టికెట్ వేరే వాళ్ళకి కేటాయించింది. ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, వివేక్,నేను వారి ఇంటికి వచ్చాం..వారి భవిష్యత్ పై మాట్లాడం. అంజన్ కుమార్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత. రెండు సార్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ,రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడుగా పని చేశారు. కరోనా సమయంలో ఎన్నో సేవ కార్యక్రమాలు చేసి ఆయన కూడా కరోనా బారిన పడ్డారు. హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీకి అంజన్ కుమార్ యాదవ్ పెద్ద దిక్కుగా ఉంటూ వస్తున్నారు.. వారి హయాంలో నగరంలో పార్టీ మరింత అభివృద్ధి చెందేలా ముందుకు పోతున్నాం. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పార్టీ నిర్ణయం తీసుకుందని అన్నారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది. ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి ప్రజలు పట్టం కడతారు. జూబ్లీహిల్స్ ఎన్నిక అంజన్ కుమార్ సారధ్యంలో జరుగుతుంది.. ఆయన నేతృత్వంలో ముందుకు పోతున్నాం. ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ అంజన్ కుమార్ యాదవ్ తో మాట్లాడారు. కంటోన్మెంట్ ఎన్నికల్లో అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టి కాంగ్రెస్ ను గెలిపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా అధికార కాంగ్రెస్ పార్టీ నీ గెలిపిస్తారు. అంజన్ కుమార్ యాదవ్ ముందుండి ఎన్నికల్లో ఈ కార్యక్రమాలు తీసుకుంటారు. మా పార్టీ నియంతృత్వం కాదు.. బయటికి స్వేచ్ఛగా చెప్పుకునే పరిస్థితి ఉంటుంది. అంజన్ కుమార్ యాదవ్ ముషీరాబాద్ లో గెలిచి ఉంటే మంత్రి అయ్యేవారు. రాహుల్ గాంధీ ని ప్రధానిని చేయడమే మా నాడు లక్ష్యమని అన్నారు.

# నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు - పెసరాయి చాంద్ బాషా

**శిరివెళ్ల (లక్ష్యం న్యూస్)**
మండల కేంద్రంలో దేగలపేట ఒకటో వార్డులో ఐదవ నెంబర్ రేషన్ షాపు డీలర్ షేక్ జాని బాబు, సచివాలయం కార్యదర్శి ఉద్యోగి(మహిళా పోలీస్) ఎస్ షాహీన్ బి తో కలిసి జనసేన పార్టీ సీనియర్ నాయకులు పెసరాయి చాంద్ బాషా ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు పెసరాయి చాంద్ బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజల సంక్షేమం కోసం ఎన్నో కొత్త పథకాలను తీసుకొచ్చి అమలు చేస్తున్నామని తెలిపారు. మెగా డీఎస్సీ, “దీపం” పథకం, “తల్లికి వందనం”, “స్త్రీ శక్తి”, “అన్నదాత సుఖీభవ” వంటి పథకాల ద్వారా మహిళలు, రైతులు, పేద కుటుంబాలందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డులలో సీఎం మంత్రి లాంటి నాయకుల ఫోటోలు లేకుండా ప్రభుత్వ రాజముద్రతో కార్డులు పంపిణీ చేయడం హర్షణీయం అని అన్నారు. ఇప్పుడు అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా మరింత పారదర్శకతతో, వేగవంతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారుల దాకా చేరుతాయని పేర్కొన్నారు. “ఆర్థికంగా ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ, అభివృద్ధి ? సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

# ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వారి సౌజన్యంతో పంట వైవిధ్యం కార్యక్రమం

**నంద్యాల (లక్ష్యం న్యూస్)**
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానము మారుటేరు మరియు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నంద్యాల వారి సౌజన్యంతో “పంట వైవిధ్యము” పథకం కర్నూలు మరియు నంద్యాల జిల్లాల్లో 2025-26 నుండి అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానము నంద్యాలలో ఈరోజు శిక్షణ కార్యక్రమము మరియు మొక్కజొన్న విత్తనాలను రుద్రవరం మండలం మందలూరు కు చెందిన 40 మంది రైతులకు అందజేశారు ఈ సందర్భంగా అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం జాన్సన్ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో పాటించవలసిన సమగ్ర సస్య రక్షణ గురించి వివరిస్తూ మొక్క జొన్న పంటలో ఆశించు కత్తెర పురుగును సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలను చేపట్టడం ద్వారా పంటను సాగు చేయాలని సూచించారు. డా.బి సహదేవరెడ్డి ప్రధాన శాస్త్రవేత్త మారుటేరు మాట్లాడుతూ, వరి పంటకు బదులుగా మొక్కజొన్న సాగు చేయాలని విత్తనాలను పుష్ హో సీ డ్రిల్ ద్వారా విత్తుకోవాలని డ్రిప్ ద్వారా నీటి యాజమాన్యం చేపట్టవలసిన అవసరం ఉందని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ మద్దిలేటి మాట్లాడుతూ సూక్ష్మ నీటిపారుదల పద్ధతైన డ్రిప్ నీటిపారుదల పద్ధతి సబ్సిడీని ఉపయోగించుకోవాలని సూచించారు డాక్టర్ కే అశోక్ కుమార్ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో చేపట్టవలసిన ఎరువుల యాజమాన్యం గురించి తెలియపరిచారు పశువుల ఎరువుతో పాటు భూసార పరీక్ష అనుసరించి నత్రజని ఎరువులు సిఫారసు మేరకు వేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో రైతులకు మొక్క జొన్న విత్తన పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడిఏ విజయ శేఖర్ గరుడ్రవరం వ్యవసాయ అధికారి సుమతి, శాస్త్రవేత్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

# శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ మెడా మురళీధర్ కు ఘన సన్మానం

**నంద్యాల (లక్ష్యం న్యూస్)**
నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ఉమ్మడి జిల్లాల కర్నూలు నంద్యాల చార్టర్ గవర్నర్ బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్త ఆధ్వర్యంలో శ్రీశైల దేవస్థానం పాలక మండలి ధర్మకర్తగా నియమించబడిన ఆర్యవైశ్య ముద్దుబిడ్డ సీనియర్ బిజెపి నాయకులు మేడా మురళీధర్ అన్న కుఆయన కార్యాలయంలో ఘనంగాసన్మానించడమైనది.. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కండె శ్యాంసుందర్ లాల్,ఉపాధ్యక్షులు మల్లిపెద్ది నాగరాజు, బొగ్గరపు జనార్ధన్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, అదనపు ప్రధాన కార్యదర్శి ఆదవేణి మురళి,కార్యదర్శులు శివశంకర్,సుబ్బారావు, నంద్యాల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూరకు శ్రీనివాస దత్తాత్రేయ, కార్యదర్శి సుబ్రమణ్యం,వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యులు మనోజ్,మోహన్,రంగయ్య, పొట్టిశ్రీరాములు క్లబ్ అధ్యక్షుడు తాళ్లూరి జనార్ధన్, కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆఫీసర్ తాళ్లూరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో కిస్న డైమండ్,బంగారు ఆభరణాల ఎగ్జిబిషన్.

**నంద్యాల (లక్ష్యం న్యూస్)**
నంద్యాల పట్టణంలోని శాంకాల్వ సెంటర్ నందు ఉన్నసౌజన్య ఫంక్షన్ హాల్ లో.ఈ నెల 11,12,13 తేదీల్లో...డైమండ్,ఆభరణాలు కొనుగోలు చేసిన వారికి లక్కీ డిప్.లక్కీ డిప్ లో గెలుపొందినవారికి కార్లు,స్కూటర్లు....నంద్యాలకు చెందిన అన్సర్ జ్యూవెలర్స్ యజమానులు అన్సర్,అమీర్ అధ్వర్యంలో మూడు రోజులు వజ్రాలు,బంగారు ఆభరణాల పండగే,పండగ. ...సామాన్య,పేద,మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ధరలతో మీ ముందుకు వస్తుంది కిస్నా డైమండ్ ఎగ్జిబిషన్..శనివారం ఉదయం మైనరీ,న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ చేతుల మీదుగా ప్రారంభం అవుతుందని తెలిపారు కావున ఎగ్జిబిషన్ షో రూమ్ ను పట్టణ ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో హంసన్ జ్యువెలర్స్ అధినేత అన్సర అమీర తదితరులుపాల్గొన్నారు

# హుస్నాబాద్ మండలంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి పలు పర్యటనలు

**హుస్నాబాద్ (లక్ష్యం న్యూస్)**
హుస్నాబాద్ మండలంలోని పందిల్ల స్టేజి వద్ద గల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.టమాటా పప్పు, పచ్చి పులుసు, గుడ్డు మాత్రమే వండారని పిల్లలకు పచ్చి పూలుసు పెడుతూ అనారోగ్యానికి గురిచేస్తారా వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొత్త కామన్ డైట్ మెనూ వాడకుండా ఇష్టానుసారంగా పెడతారా ప్రిన్సిపల్ పైన మండిపడ్డారు. పిల్లలకు మెనూ ప్రకారం పెట్టలేదని యాక్షన్ తీసుకోవాలని డిఈఓ కీ ఫోన్ ద్వారా ఆదేశించారు. తక్కువ మంది పిల్లలు వచ్చారు, కూరగాయలు దొరకట్లేదు అని సాకులు చెబితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడమే మధ్యాహ్న భోజన పథకం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.మండలం లోని పందిళ్ల గ్రామ అంగన్వాడి సెంటర్ ను జిల్లా కలెక్టర్ సందర్శించి అంగన్వాడి లో పిల్లలకు అందించే సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పిల్లలకు సాంబారు గుడ్డు పెట్టినట్లు ఆయా కలెక్టర్ కి తెలిపారు. పిల్లలతో ఆప్యాయంగా పలకరించారు. పిల్లలకు అందించే స్నాక్స్ టేస్ట్ చేశారు రోజు సరిపడినన్ని పెట్టాలని ఆయా ను ఆదేశించారు. బాలింతలకు అందించే బాలమృతం ఇతర సరుకులను చెక్ చేశారు. విధులు సక్రమంగా నిర్వహించాలని అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలోని బస్తీ దవాఖాన ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మెడికల్ ఆఫీసర్ డిప్యూటిషన్ రద్దు వల్ల వెళ్ళారని డాక్టర్ లేక వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారని సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. డాక్టరు వచ్చేలా చూస్తానని రోగులకు మాత్రం ఓపికగా వైద్యం చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు.

# ఏసీబీకి చిక్కిన గ్రామ పంచాయతీ కార్యదర్శి

**కరీంనగర్ (లక్ష్యం న్యూస్)**
గంగాధర మండలం లోని మధురానగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్ పై అవినీతి నిరోధక శాఖ ఏసీబీ, అధికారులు దాడులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటున్నట్టు ఫిర్యాదు రావడంతో, ఏసీబీ అధికారుల ఉచ్చులో చిక్కినట్లు ప్రాథమిక సమాచారం. వివరాల్లోకి వెళితే:ఒక వ్యక్తి దగ్గర మధురానగర్ గ్రామ పంచాయతీ సంబంధిత ఇందిరమ్మ ఇంటి బిల్లు కోసం డబ్బులు రూ.10,000 డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు తెలియజేయగా, వారు ముందస్తు ప్రణాళికతో ట్రాప్ ఏర్పాటు చేసి కార్యదర్శిని లంచం స్వీకరిస్తున్న సమయంలో పట్టుకున్నారు. అధికారిని అదుపులోకి తీసుకుని ఏసీబీ అధికారులు పంచాయతీ కార్యాలయం, శోధనలు నిర్వహిస్తున్నారు. లంచం తీసుకున్న మొత్తం, సంబంధిత పత్రాలు, రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# జూబ్లీహిల్స్లో వాహన తనిఖీలు.. రూ.9 లక్షల నగదు సీజ్

**హైదరాబాద్ (లక్ష్యం న్యూస్)**
ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.9 లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు రోడ్ నంబర్ 5లోని మెట్రోస్టేషన్ వద్ద ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో ఎల్బీనగర్ సరస్వతీనగర్ కాలనీలో నివాసముంటున్న బిల్డింగ్ మెటీరియల్ సూపర్వైజర్ అయితగోని రవి చేతిలో బ్యాగుతో మెట్రో స్టేషన్ మెట్లు ఎక్కుతూ అనుమానాస్పదంగా కనిపించాడు.పోలీసులు అతడి బ్యాగు తనిఖీ చేయగా భారీగా నగదు కనిపించింది. ఆ డబ్బు లెక్కించగా రూ.9 లక్షలు అని తేలింది. నగదుకు సంబంధి పత్రాలు చూపించలేక పోవడంతో పోలీసులు నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారికి అప్పగించారు..

# కార్పొరేషన్ లో పట్టు వయా ఉపఎన్నిక

**హైదరాబాద్, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**
జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అనుసరించాలనుకున్న వ్యూహం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయిందనే సంకేతాలు వెలువడుతున్నాయి. బీజేపీ అభ్యర్థికి తమ మద్దతు ప్రకటించి, తెలంగాణ రాజకీయాల్లో తమ ఉనికిని, నిర్ణయాత్మక శక్తిని చాటుకోవాలని టీడీపీ భావించింది. అయితే, ఊహించని విధంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆ మద్దతును తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తటస్థ వైఖరి అవలంబించాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో టీడీపీ మద్దతు ఇచ్చేందుకు సిద్ధమైనా కూడా బీజేపీ నిరాకరించిందని సమాచారం. ఇందుకు అనేక కారణాలను బీజేపీ వెల్లడించినట్లు సమాచారం. ముఖ్యంగా తెలంగాణలో చంద్రబాబుపై ఉన్న వ్యతిరేకత వల్లే టీడీపీ మద్దతు తీసుకోకూడదని బీజేపీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలోని ప్రధాన వర్గాల్లో చంద్రబాబుపై బలమైన వ్యతిరేకత ఉన్నట్లు బీజేపీ నాయకత్వం గుర్తించింది. ఈ సమయంలో టీడీపీ మద్దతు తీసుకుంటే, అది ఉపఎన్నికలో తమ పార్టీ అభ్యర్థికి నష్టం చేకూరుస్తుందని, ఓటర్లు దూరం జరిగే అవకాశం ఉంటుందని బీజేపీ భావించింది. అందుకే టీడీపీ మద్దతు తమకు అక్కర్లేదని, ఒంటరిగానే బరిలోకి దిగుతామని చెప్పినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇతరుల మద్దతుపై ఆధారపడకుండా, సొంత బలంతోనే విజయం సాధించాలనే సంకేతాన్ని బీజేపీ ఇవ్వదలుచుకున్నట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రాకపోవడంతో టీడీపీ నాయకత్వం డీలా పడినట్లు సమాచారం. అలాగని ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశం లేదు. మంగళవారం ఉండవల్లిలో టీటీడీపీ నేతలతో చంద్రబాబు సమావేశం సందర్భంగా ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. బీజేపీ మద్దతు కోరితే ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని, లేకుంటే తటస్థంగా ఉండాలని పార్టీ కేడర్ కు ఆయన సూచించారు. అలాగే, ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీలకు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీజేపీకి మద్దతు ఇవ్వడం ద్వారా తెలంగాణలో కూడా ప్రభావం చూపించాలని టీడీపీ భావించింది. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కొన్ని సీట్లయినా గెలుచుకోవడం ద్వారా ప్రభావం చూపించాలనని చంద్రబాబు వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది. కానీ, బీజేపీ తమ మద్దతును తిరస్కరించడంతో ఆయన వ్యూహం బెడిసికొట్టినట్లయింది. పోటీకి దూరంతెలంగాణ రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీకి దూరంగా ఉంటుందని అధికారికంగా ప్రకటించింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పోటీ చేయరాదని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. పోటీకీ పార్టీ శ్రేణులు సమాయత్తంగా లేరన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఉప ఎన్నికల్లో ఏ పార్టీకీ మద్దతు ఇవ్వరాదని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలంగాణ టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జాతీయ స్థాయి కూటమిలో భాగస్వామ్యంగా ఉన్నందున బీజేపీ కోరితే జూబ్లీహిల్స్‌లో మద్దతు విషయం ఆలోచిద్దామని చంద్రబాబు అన్నారు. సమర్థ నాయకత్వాన్ని అందించేవారికే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని తెలంగాణ టీడీపీ నాయకులకు స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత కమిటీల నియామకాలు పూర్తిచేసుకుని కార్యక్రమాలు పెంచాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాల్లో బలమైన శక్తిగా ఎదుగుదాం, ఇందుకోసం సంస్థాగతంగా బలోపేతం కావడం ముఖ్యం. అన్ని స్థాయుల్లో కమిటీలను పూర్తిచేయండి. ఎప్పటికప్పుడు నేను కూడా దిశానిర్దేశం చేస్తా అని చంద్రబాబు అన్నారు.

# అయినా కమలం ఎందుకో వెనుకబడింది

**హైదరాబాద్, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**
జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ వెలువడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఈ ఉపఎన్నికపై ఎక్కువగా ఫోకస్ పెట్టాయి. కానీ భారతీయ జనతా పార్టీమాత్రం ఇప్పటికీ అభ్యర్థి ఎంపిక, ప్రచార వ్యూహం విషయంలో వెనుకబడింది. ఇది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఈ కీలక నియోజకవర్గాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటామని చెబుతున్నప్పటికీ, పార్టీలో నెలకొన్న అంతర్గత సందిగ్ధత, ఆలస్యం పలు ప్రశ్నలకు తావిస్తున్నాయి. బీజేపీ ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించకపోవడానికి ప్రధాన కారణం, రాష్ట్ర నాయకత్వం మధ్య తలెత్తిన అభిప్రాయ భేదాలేనని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య అభ్యర్థి ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదని వార్తలు వస్తున్నాయి. ఈ అంతర్గత విభేదాల కారణంగానే జాప్యం జరిగిందని, అందుకే సమస్య పరిష్కారం కోసం హైకమాండ్ ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసిందని సమాచారం. ఇది పార్టీలోని సమన్వయ లోపాన్ని బహిర్గతం చేస్తోంది. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటి జయసుధను బీజేపీ బరిలోకి దించే అవకాశం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. జయసుధ గతంలో కాంగ్రెస్ తరపున సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహించారు. జూబ్లీహిల్స్‌లో ఉన్న గ్లామర్, ఎలైట్ వర్గాల ఓటర్లను, అలాగే సినీ అభిమానులను ఆకట్టుకోవడానికి బీజేపీ ఆమె అభ్యర్థిత్వాన్ని ఒక స్ట్రాటజీగా ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఆమె అభ్యర్థిత్వం ఖరారైతే, అది నిస్సందేహంగా ఎన్నికలకు కొత్త ఫ్లేవర్ తీసుకొస్తుంది. అయితే జయసుధ క్రిస్టియన్ కావడం, ఇటీవలే పార్టీలో చేరడం లాంటివి ఆమెకు మైనస్ కావచ్చు. ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ లేకపోవడం, హిందుత్వ నినాదాన్ని తీసుకెళ్లే అవకాశం ఉండకపోవడం లాంటివి జయసుధ అభ్యర్థిత్వాన్ని వెనక్కు నెట్టవచ్చు. బీజేపీ ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిలో కనిపిస్తోంది. అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించడం ద్వారా, చివరి నిమిషంలో ప్రచార పదును పెంచి, ప్రత్యర్థులు వ్యూహాలు మార్చుకోవడానికి సమయం లేకుండా చేయాలని భావిస్తూ ఉండొచ్చు. అయితే, అభ్యర్థి ఎంపిక విషయంలో అంతర్గత సమస్యే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రధాన ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు, వారి సామాజిక సమీకరణాలను బేరీజు వేసిన తర్వాత, అత్యంత బలమైన లేదా అత్యంత ప్రభావవంతమైన అభ్యర్థిని ఎంపిక చేయాలని బీజేపీ చూస్తుంది. జూబ్లీహిల్స్ పరిధిలోని ఓటరు వైవిధ్యాన్ని పరిగణలోకి తీసుకుని, జయసుధ లాంటి బలమైన గ్లామర్ అస్త్రాన్ని ఉపయోగించాలనుకోవచ్చు. అయితే అభ్యర్థి ఖరారులో జరుగుతున్న ఈ జాప్యం, బీజేపీకి ప్రతికూల అంశంగా మారే అవకాశం ఉంది. ప్రచారం కోసం సమయం తక్కువగా ఉంటుంది. అయితే, జయసుధ లాంటి సెలబ్రిటీని బరిలోకి దింపితే, ఆలస్యాన్ని అధిగమించి, ప్రజల్లో త్వరగా పట్టు సాధించే అవకాశం ఉంటుంది. మొత్తం మీద, ఉపఎన్నికలో సత్తా చాటాలంటే, బీజేపీ వెంటనే అంతర్గత సమస్యలను పరిష్కరించుకుని, వ్యూహాత్మకంగా అభ్యర్థిని ప్రకటించి, ప్రచారాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

# కొలువుల జాతర

**హైదరాబాద్, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**
తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల భర్తీకి ప్రాధాన్యం ఇస్తోంది. గడిచిన ఏడాదిన్నర పాలనలో 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది. జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేసింది. అయితే దాని ప్రకారం నోటిఫకేషన్లు రావడం లేదు. ఈ తరుణంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. సర్కార్ రెండు ఏళ్ల పాలన పూర్తి కాబోతున్న వేళ, ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయడానికి తెలంగాణప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే రెండు నెలల్లో సుమారు 25 వేల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు సమాచారం.

## పోలీస్ విభాగానికే ప్రధాన ప్రాధాన్యత

- డీజీపీ శివధర్ రెడ్డి ప్రకారం, పోలీస్ శాఖలో దాదాపు 17,000 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- సబ్ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్, టెక్నికల్ సిబ్బంది, కమ్యూనికేషన్ విభాగం తదితర విభాగాలకు ఈ అవకాశాలు వచ్చే అవకాశం ఉంది.
- అంతేకాదు, ఆధునిక పోలీసింగ్ సదుపాయాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వబోతున్నారు.

విద్యా రంగంలో కొత్త అవకాశాలు

- టీచర్ రిక్రూట్‌మెంట్ (డీఎస్సీ)తో పాటు డైట్, డిప్యూటీ డీఈవో, బీఈడీ కాలేజీ లెక్చరర్లు, ఎస్‌ఈఆర్టీ పోస్టుల కూడా ఈ జాబితాలో ఉన్నాయి.
- రాష్ట్రంలోని విద్యా వ్యవస్థలో ఖాళీలు తగ్గించడంతోపాటు, నాణ్యతను మెరుగుపర్చే దిశగా ఈ నియామకాలు కీలకంగా మారే అవకాశం ఉంది.

గ్రూప్ సేవల నోటిఫికేషన్లు సన్నాహాల్లో

- తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్?1, గ్రూప్?2, గ్రూప్?3, గ్రూప్?4 నోటిఫికేషన్లకు కూడా తుది దశలో సన్నాహాలు పూర్తిచేస్తోంది.
- కొత్త సిలబస్, డిజిటల్ పరీక్షా పద్ధతి, పారదర్శక నియామక విధానంపై ఈసారి ప్రత్యేక దృష్టి పెట్టబోతోంది. అభ్యర్థులకు ఇది చక్కని అవకాశం
- ఉద్యోగ నియామకాలు రాజకీయ హామీల సాకార రూపంగా మాత్రమే కాకుండా, నిరుద్యోగ యువతకు పెద్ద ఉపశమనం అవుతాయి.
- గత రెండేళ్లుగా నిలిచిపోయిన తాత్కాలిక నియామకాలు తిరిగి చోదక శక్తిగా మారవచ్చు.
- ముఖ్యంగా గ్రాడ్యుయేట్, పీజీ, బీ.ఏడ్ అభ్యర్థులకు విస్తృత అవకాశాలు లభించే అవకాశం ఉంది.

# బాణాసంచా తయారీ కేంద్రానికి తాళాలు

**నర్సాపురం (లక్ష్యం న్యూస్)**
పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం సబ్ డివిజన్ పరిధిలోని దీపావళి బాణాసంచా తయారీ కేంద్రాలను ఆర్డీవో దాసిరాజు , డిఎస్పీ డాక్టర్ శ్రీ వేదాలు అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి లక్ష్మనేశ్వరం గ్రామంలో తయారీ కేంద్రానికి సీల్ వేశారు. అలాగే మండలంలోని దీపావళి బాణాసంచా లైసెన్స్ దుకాణాలు, వాటి గూడౌన్లను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను ఆరా తీశారు. తరువాత వారు మీడియా తో మాట్లాడుతూ తయారీ కేంద్రాలకు లైసెన్స్ లో ఉన్నప్పటికీ వర్కర్ల సేఫ్టీ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు లైసెన్స్ తయారీ కేంద్రాలకు సీల్ వేసామన్నారు. అనధికారికంగా ఎక్కడైనా బాణ సంచి తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఒకే గొడుకు కిందకు నాలుగు బ్యాంకులు

**విజయవాడ, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

ఏపీలో ఇక రకరకాల పేర్లతో గ్రామీణ బ్యాంకులు కనిపించవు. ఒకే ఒక గ్రామీణ బ్యాంకు ఇకనుంచి కొనసాగనుంది. కొద్ది రోజుల కిందట కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల విలీనంపై ప్రకటన చేసింది. నాలుగో విడత బ్యాంకుల విలీనంపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఒకే దేశం- ఒకే ఆర్ఆర్బీ కింద దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్న గ్రామీణ బ్యాంకులను ఏకీకరించాలని నిర్ణయం తీసుకుంది. అంటే ఒక్కో రాష్ట్రంలో ఒక గ్రామీణ బ్యాంకు పేరు కొనసాగించనుంది. దీంతో ఏపీవ్యాప్తంగా ఉన్న నాలుగు గ్రామీణ బ్యాంకులు.. ఒకే గ్రామీణ బ్యాంకు గొడుగు కిందకు రానున్నాయి.ప్రస్తుతం ఏపీలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ శాఖలు ఉన్నాయి. ఇవన్నీ ఒకే సంస్థ కిందకు రానున్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా మారనున్నాయి. ఈ లెక్కన ఇకనుంచి ఈ గ్రామీణ బ్యాంకులనేవి కనిపించవు. ఈ విలీన ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఒక ఉత్తర్వులు జారీ చేసింది. ఐదు రోజులపాటు బ్యాంకు సేవలను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 9 సాయంత్రం 6:00 నుంచి.. అక్టోబర్ 13 ఉదయం 10 గంటల వరకు ఈ ఐదు బ్యాంకుల సేవలు నిలిచిపోనున్నాయి. సామాజిక మాధ్యమాలతో పాటు ప్రతి ఖాతాదారుడు కి వ్యక్తిగతంగా సమాచారం వచ్చింది.గ్రామీణ బ్యాంకుకు సంబంధించి ఆఫ్లైన్ తో పాటు ఆన్లైన్ సేవలు కూడా నిలిచిపోనున్నాయి. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపిఎస్, ఏటీఎం సేవలు, బ్యాంకు మిత్రాలు కూడా అందుబాటులో ఉండబోవని స్పష్టం చేసింది. అయితే అక్టోబర్ 11 రెండో శనివారం, 12 ఆదివారం బ్యాంకులకు సెలవులు. అప్పుడు కూడా ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉండవు. ఏటీఎం సేవలు కూడా అందుబాటులో ఉండని పరిస్థితి. మూడు రోజులపాటు పూర్తిగా సేవలు నిలిపివేయనున్నాయి. అయితే ఇప్పటికే గత కొద్ది రోజులుగా దీనిపై గ్రామీణ బ్యాంకులో అప్రమత్తం చేశాయి. లావాదేవీలు జరుపుకోవడానికి ఈరోజే చివరి దినం. సాయంత్రం 6 గంటల్లోగా సేవలను వినియోగించుకోవాలని గ్రామీణ బ్యాంక్ సూచించింది కస్టమర్లకు. అయితే డ్వాక్రా సంఘాల బ్యాంకు లావాదేవీలు అన్ని గ్రామీణ బ్యాంకుల ద్వారా జరుగుతాయి. అందుకే ఆయా బ్యాంకు యాజమాన్యాలు ముందస్తుగానే అప్రమత్తం చేశాయి.

# చెట్టుకు ఢీకొట్టిన కారు

## ఏడుగురికి తీవ్ర గాయాలు

**జగిత్యాల (లక్ష్యం న్యూస్)**

కోరుట్ల, మెట్పల్లి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపు తప్పిన కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ఏడుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. అందులో ముగ్గురు పరిస్థితి విషమంగా వుంది. గురువారం రాత్రి కోరుట్ల పట్టణానికి చెందిన ఏడుగురు యువకులు, కోరుట్ల నుండి మారుతీ నగర్ దాబా దగ్గర చాయ్ తాగడానికి వెళ్లడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది.. క్షతగాత్రులను జగిత్యాల్, కరీంనగర్ ఆసుపత్రి లకు తరలించారు.

# ప్రాణాలు కాపాడిన సెహభాస్ పోలీస్ అమర...!!

**బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువకుడికి పునర్జన్మను ఇచ్చిన పోలీస్**

**మదనపల్లె (లక్ష్యం న్యూస్)**

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెకు వచ్చి బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన బెంగళూరు యువకున్ని పోలీస్ కానిస్టేబుల్ అమర చాకచక్యంగా కాపాడి ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మను ఇచ్చాడు. ఆ వివరాలు.. బెంగళూరుకు చెందిన చెంగాచారి(26), భార్య శశి, కుమారిడి తో కలసి గురువారం మదనపల్లి లోని ఓ ప్రముఖ ఆలయానికి వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో భార్యా భర్తలు గొడవ పడ్డారు. భార్య శశి తిట్టిందని మనస్థాపంతో చేతి నరాలు కోసుకొని స్థానిక మడికయిల శివాలయానికి సమీపంలో ఉన్న కోడుగుడ్డు బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. అయితే బావిలో ఉన్న చెట్ల కొమ్మల ను పట్టుకుని రాత్రంతా కేకలు వేస్తూ.. కాపాడమని అరిచాడు. ఉదయం అటుగా వెళుతున్న పాదచారులు గుర్తించారు. అదే సమయంలో తన పిల్లలను స్కూలుకు బైకులో తోడుకుని వెళుతున్న మదనపల్లి రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ డ్రైవర్ అమర గుర్తించి వెంటనే రోపు సాయంతో చెంగా చారిని వెలికి తీసి కాపాడి స్థానికుల దగ్గర ప్రశంసలు అందుకున్నాడు.ద

# బీహార్ పై అన్ని పార్టీలు గురి

**పాట్నా, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

బీహార్ అసెంబ్లీకి నవంబర్లో ఎన్నికలు జరుగనున్నాయి. రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ అమలు చేయని మూడు కీలక చర్యలను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. అధికార, విపక్ష పార్టీలకు అభ్యంతరం చెప్పే వీలు లేకుండా, ఈ మార్పులు ఓట్ల క్రమబద్ధమైన లెక్కింపు, ఫేక్ ఓటింగ్ నిరోధానికి దోహదం చేయనున్నాయిఈసీ చేపట్టిన మూడు మూడు మార్పుల్లో మొదటిది ఇది. ప్రతీ పోలింగ్ బూత్లో ఓటింగ్ ప్రారంభం నుంచి అంటే ఈవీఎంల స్టిక్కర్లు తొలగించి పోలింగ్ తర్వాత మళ్లీ ఈవీఎంలకు సీల్ వేసే వరకూ వెబ్కాస్టింగ్ జరుగుతుంది. నేరుగా ఈ ప్రసారం మానిటరింగ్ బృందాలకు చేరుతుంది. పోలింగ్ అనంతరం కూడా మానిటరింగ్పై సమగ్రంగా సంతకాలతో ధృవీకరణ ఉంటుంది. దీంతో రిగ్గింగ్, ఓట్ల దొంగతనం వంటి తప్పిదాలు తక్షణమే గుర్తించడం, నిరోధించడం సాధ్యం. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విధానంలో మార్పుఇక రెండో కీలక మార్పు ఇదీ.. ఇప్పటి వరకు ఈవీఎం ఓట్లు సరిచూసిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరిగేది. ఇకపై ముందుగా పోస్టల్ ఓట్ల లెక్కింపు పూర్తయి చివర్లో ఈవీఎం ఓట్ల చివరి రౌండ్ కౌంటింగ్ జరుగుతుంది. పోస్టల్ ఓట్లలో అవకతవకలకు అవకాశమే లేకుండా, ఫలితాలపై ప్రభావం జరగకుండా ఉంటుంది.మూడోది అత్యంత కీలకమైనది ఇది. బుర్కా ధరించి వచ్చే మహిళా ఓటర్ల గుర్తింపుపై ప్రతిసారి వివాదం జరుగుతోంది. మిగతా సందర్భాల్లో బుర్కా తొలగించేందుకు అభ్యంతరం చెప్పని ముస్లిం మహిళలు.. పోలింగ్ కేంద్రాల్లో మాత్రం అభ్యంతరం చెబుతున్నారు. దీంతో ఈసారి అలాంట సమస్య ఉండకుండా ముస్లిం మహిళా ఓటర్ల బుర్కా తొలగించి ఓటర్ ఐడీ లేదా ఇతర గుర్తింపు కార్డుతో ముఖాన్ని పోల్చేందుకు అంగన్వాడీ మహిళలను నియమించారు. గుర్తింపు కార్డుతో ప్రత్యక్ష ముఖచిత్రం సరిపోలిన తర్వాతే ఓటు వేయాలని కొత్త విధానం. దీంతో ఫేక్ ఓటింగ్, ఐడెంటిటీ మోసాలను అరికట్టే అవకాశం ఉంది. ఇది బిహార్లో విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలు చేయవచ్చు.? ఓటరు గుర్తింపు జాబితాలో అభ్యర్థుల ఫొటోలు బ్లాక్?అండ్?వైట్ స్థానంలో కలర్ రూపంలో ఉండనున్నాయి. దీనివల్ల గుర్తుపట్టడం సులభం. ఈసీ తీసుకువచ్చిన 17 మార్పులుఈ విధానాలు విజయవంతమైతే, బీహార్లోనే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల నిజమైన హక్కులను రక్షించే కొత్త ఎన్నికల ప్రమాణంగా నిలుస్తాయి. ముఖ్యంగా నిరంతర వెబ్కాస్టింగ్, పోస్టల్ ఓట్ల క్రమబద్ధత, బుర్కా ధ్రువీకరణ ఇవి ఓటు ప్రక్రియలో పరివర్తనాత్మక మార్పులు.

# అటవీ శాఖలో దోపిడీ

**ఖమ్మం, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

ఖమ్మం జిల్లా అటవీ శాఖలో దోపిడీ జరిగింది. అయితే ఇదంతా ఇంటి దొంగలు పనే అని తేల్చారు ఉన్నతాధికారులు. కలప అక్రమ రవాణాలో ఎవరెవరి ప్రమేయం ఉందనే దానిపై జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ ?సిద్ధార్థ్ విక్రమ్ ?సింగ్ నేతృత్వంలో టాస్క్? ఫోర్స్ ?రేంజ్?ఆఫీసర్లు దర్యాప్తు చేపట్టారు. చింతకాని మండలం నుంచి సర్కారు తుమ్మ కలప తరలించేందుకు ముందుగా నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుని, అనంతరం సూర్యాపేట, మహబూబాబాద్ ?జిల్లాలోని ప్రైవేట్ భూముల్లో నరికిన సంద్ర కలపను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు బహిర్గతమైంది. అయితే ఎలాంటి ఫీల్డ్ వెరిఫికేషన్? లేకుండా, వాల్టా ఫీజు వసూలు చేయకుండా, నేషనల్ ట్రాన్సిట్ పాస్ ?సిస్టమ్ద్వారా ఆన్?లైన్ లో ఎన్?వోసీలను జారీ చేసినట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. ఇప్పటికే ప్రాథమిక దర్యాప్తులో భాగంగా చింతకాని ఫారెస్ట్ బీట్? ఆఫీసర్ను సస్పెండ్? చేశారు. సంద్ర చెట్టు దుంగల అక్రమ రవాణాపై ఎంక్వైరీ చేస్తున్నామని ఖమ్మం ఆఈూ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ తెలిపారు.పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించిన తర్వాత బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆఈూ తెలిపారు. చట్టవిరుద్ధ పనుల్లో పాల్గొన్న అధికారులు, వ్యక్తులపైనా క్రిమినల్ చర్యలు ఉంటాయన్నారు. గుట్కా వంటి పాన్?మసాలాల తయారీలో, పాన్?లో ఉపయోగించే కత్తా తయారీలో సంద్ర కలపను వినియోగిస్తారని అధికారుల ఎంక్వైరీలో తేలింది. మధ్యప్రదేశ్?, మహారాష్ట్ర, గుజరాత్, హర్యానాలో ఇలాంటి పరిశ్రమలు ఉండగా.. అక్కడ కలపకు విపరీతమైన డిమాండ్? ఉంది. దీంతో తెలంగాణ జిల్లాల్లోని విలువైన సంద్ర కలపను తరలించేందుకు ఫేక్?ఎన్వోసీ రూట్ ను స్మగ్లర్లు ఎంచుకున్నట్టు అధికారులు గుర్తించారు.

## ఏపీలో అనాధలు, నిరాశ్రయులకు

# అమృత అరోగ్య పథకం విస్తరణ

**అమరావతి (లక్ష్యం న్యూస్)**

ఏపీలో అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులకు 'అమృత ఆరోగ్య పథకం' విస్తరణ కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా 1,113 మందికి పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం ఆదేశించింది, ప్రస్తుతం రాష్ట్రంలో 2,812 మందికి 'అమృత ఆరోగ్య పథకం' అమలు అవుతోంది. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా ఉచితంగా చికిత్సలు అందించాలని నిర్ణయించారు. 1,044 థెరపీలు/సర్జరీలు సహా ఏటా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించనున్నారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేసారు. .

# కాంతారా వసూళ్ల వాన




**హైదరాబాద్, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

భారీ అంచనాల నడుమ రీసెంట్ గా విడుదలైన 'కాంతారా 2? చిత్రం డీసెంట్ స్థాయి వసూళ్లను నమోదు చేసుకుంటూ ముందుకు దూసుకెళ్తుంది. వారం రోజులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ ట్రెండ్ ని ఒకసారి పరిశీలిస్తే, ఇండియన్ మార్కెట్ లో పర్వాలేదు అనే రేంజ్ ట్రెండ్ ని కనబరిచినప్పటికీ, ఓవర్సీస్ లో మాత్రం డిజాస్టర్ పెర్ఫార్మన్స్ ని నమోదు చేసుకుంటుంది. కానీ ఈ ఏడాది బాక్స్ ఆఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి భారీ బ్లాక్ బస్టర్స్ గా నమోదు చేసుకున్న కూలీ, ఓజీ చిత్రాల ఫుల్ రన్ గ్రాస్ వసూళ్లను మొదటి వారం లోనే అధిగమించింది ఈ చిత్రం. సీక్వెల్ క్రేజ్ తో వచ్చిన ఈ సినిమాకు ఆ మాత్రం గ్రాస్ వసూళ్లు రావడం లో వింతేమీ లేదు కానీ, బ్రేక్ ఈవెన్ కి ఇప్పటి వరకు వచ్చిన వసూళ్లు అసలు సరిపోవని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్.విడుదలకు ముందు ఓవరాల్ గా ఈ చిత్రానికి 342 కోట్ల రూపాయిల ప్రీ రిలీజ్ థియేట్రికల్ బిజినెస్ జరిగింది. ఇప్పటి వరకు 220 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. బ్రేక్ ఈవెన్ మార్కుని అందుకోవాలంటే మరో 121 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లను రాబట్టాల్సి ఉంటుంది. ఒక సినిమాకు రెండవ వారం నుండి ఈ రేంజ్ షేర్ వసూళ్లు రావాలంటే రెండవ వారం నుండి వేరే లెవెల్ షేర్ హోల్డ్ ని కనబర్చాల్సిన అవసరం ఉంటుంది. కానీ ట్రెండ్ ని చూస్తుంటే కాంతారా 2 కి అంత రేంజ్ లేదని అనిపిస్తుంది. ఎంత రాబట్టిన ఈ వీకెండ్ లోనే రాబట్టాలి. ఆ తర్వాత దీపావళి కి బోలెడన్ని సినిమాలు విడుదల అవుతున్నాయి. బ్రేక్ ఈవెన్ అవ్వడం చాలా కష్టం. మన తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ చిత్రం 41 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లను బ్రేక్ ఈవెన్ కోసం రాబట్టాల్సి ఉంటుంది. సోమవారం నుండి రోజుకి కోటి రూపాయిల లెక్కన షేర్ వసూళ్లను హోల్డ్ చేస్తే కానీ బ్రేక్ ఈవెన్ అసాధ్యం అని అంటున్నారు ట్రేడ్ పండితులు.ఒక్క కర్ణాటక రాష్ట్రంలో మాత్రం ఈ చిత్రం స్టడీ కలెక్షన్స్ ని నమోదు చేసుకుంటుంది. హిందీ వెర్షన్ వసూళ్లు రీసెంట్ గానే 115 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను నమోదు చేసుకుంది. ఇక ఓవర్సీస్ లో అయితే 68 కోట్ల రూపాయిల గ్రాస్ వద్దనే ఆగిపోయింది ఈ చిత్రం. ఒక్క నార్త్ అమెరికా లోనే ఈ చిత్రాన్ని 9 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసారు. ఇప్పటి వరకు కనీసం మూడు మిలియన్ డాలర్ల గ్రాస్ ని కూడా రాబట్టలేకపోయింది. ఇక మిగిలిన ఓవర్సీస్ మర్కెట్స్ లో అయితే పరిస్థితి చాలా దారుణంగా తయారైంది. ఓవరాల్ గా ఈ చిత్రానికి మొదటి వారం లో 446 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం, 220 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లను రాబట్టింది.

# టారిఫ్ పై ట్రంప్ యూ టర్న్...

**హైదరాబాద్, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సుంకాల బాంబుతో అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపారు. భారతదేశం కూడా దీని ప్రభావానికి గురైంది. అయితే, స్వాగతించదగిన పరిణామంలో, ట్రంప్ సర్కార్ జనరిక్ ఔషధాలపై సుంకాలు విధించే ప్రణాళికలను పక్కన పెట్టింది. ఈ నిర్ణయం భారత ఔషధ పరిశ్రమకు గణనీయమైన ఉపశమనం కలిగిస్తుంది. ఎందుకంటే అమెరికాలో ఉపయోగించే తక్కువ ధర మందులు చాలావరకు భారతదేశం నుండి ఎగుమతి చేసుకున్నవే కావడం విశేషం. సుంకాలు విధించినట్లయితే, భారతీయ మందులు అమెరికా మార్కెట్లో మరింత ఖరీదైనవిగా మారతాయి. వాటి డిమాండ్ తగ్గే అవకాశం ఉంది.మెడికల్ డేటా అనలిటిక్స్ కంపెనీ నివేదిక ప్రకారం, అమెరికాలో ఉపయోగించే జనరిక్ ఔషధాలలో దాదాపు 47% భారతదేశం నుండే వస్తున్నాయి. భారతదేశం వాటా చాలా ముఖ్యమైనది. దీనిని తరచుగా "ప్రపంచ ఫార్మసీ" అని పిలుస్తారు. అమెరికా ఆరోగ్య సంరక్షణ రంగంలో భారతీయ ఔషధాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్, యాంటీబయాటిక్స్ వంటి ప్రాణాలను రక్షించే మందులు భారతీయ కంపెనీల నుండి పెద్ద మొత్తంలో దిగుమతి అవుతాయి. ఈ మందులు స్థానికంగా ఉత్పత్తి చేసిన వాటి కంటే అమెరికాలో చాలా తక్కువ ధరకు లభిస్తాయి. దీని వలన దాని పౌరులకు ఉపశమనం లభిస్తుంది.ది వాల్ స్ట్రీట్ జర్నల్లోని ఒక కథనం ప్రకారం, ట్రంప్ సర్కార్ జెనరిక్ ఔషధాలపై సుంకాలు విధించడంపై దర్యాప్తు ప్రారంభించింది. ఈ దర్యాప్తులో పూర్తయిన ఔషధాలే కాకుండా వాటి తయారీలో ఉపయోగించే ముడి పదార్థాలు కూడా ఉన్నాయి. అయితే, దర్యాప్తు తర్వాత, వాణిజ్య శాఖ పరిధిని తగ్గించాలని సిఫార్సు చేసింది. ఎందుకంటే జెనరిక్ ఔషధాలపై సుంకాలు విధించడం వల్ల అమెరికాలో ఔషధ ధరలు పెరుగుతాయని, మార్కెట్ కొరత ఏర్పడవచ్చని చాలా మంది నిపుణులు అభిప్రాయపడ్డారు. ఒక వర్గం విదేశీ ఔషధాలపై అధిక సుంకాలు విధించడం ద్వారా ఉత్పత్తిని జూకు తిరిగి తీసుకురావాలని కోరుకోగా, మరొక వర్గం అలాంటి చర్య అమెరికన్ ప్రజలకు హానికరం అని అభిప్రాయపడ్డారు.

**సుంకాల యుద్ధంతో ప్రపంచంపై ప్రభావం!**

గత కొన్ని నెలలుగా డొనాల్డ్ ట్రంప్ సుంకాల విధానాలు ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలిచాయి. మొదట, ఆయన చైనాపై దిగుమతి సుంకాలను విధించారు. దీని ఫలితంగా చైనా అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లను నిలిపివేసింది. ఇది అమెరికన్ రైతులకు గణనీయమైన దెబ్బ తగిలింది. వ్యవసాయ మార్కెట్లో సంక్షోభాన్ని సృష్టించింది. అదేవిధంగా, భారతదేశంపై ఔషధ సుంకాలు విధించినట్లయితే, అది జూ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ప్రభావం చూపేది. సరసమైన, నమ్మదగిన భారతీయ మందులు అందుబాటులో లేకుండా, అదే చికిత్స అమెరికన్ రోగులకు చాలా ఖరీదైనదిగా ఉండేది.భారత ఔషధ పరిశ్రమ జనరిక్ ఔషధాలలో ప్రపంచవ్యాప్తంగా అగ్రగామిగా ఉంది. భారతీయ కంపెనీలు సరసమైన, అధిక నాణ్యత గల మందులను అమెరికాకు మాత్రమే కాకుండా యూరప్, ఆఫ్రికా, ఆసియా దేశాలకు కూడా ఎగుమతి చేస్తాయి. అమెరికా మార్కెట్ భారతదేశానికి అతిపెద్ద ఎగుమతి గమ్యస్థానం. ఏటా బిలియన్ డాలర్ల విలువైన మందులను రవాణా చేస్తుంది. కాబట్టి ట్రంప్ సర్కార్ వాయిదా వేయాలనే నిర్ణయం భారతీయ కంపెనీలకు స్వాగతించదగిన ఉపశమనం..

# ప్రత్యామ్నాయాలపై సర్కార్ దృష్టి కిం కర్తవ్యం

**హైదరాబాద్, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ సర్కార్ జారీ చేసిన జీవో నెంబర్ 9 అమలుపై హైకోర్టు మధ్యంతర స్టే విధించడం తెలిసిందే. దీంతో, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని ఆ ప్రకటనలో పేర్కొంది. జీవో నెంబర్ 9పై హైకోర్టు మధ్యంతర స్టే విధించడంతో, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన ఆప్షన్స్ ఉన్నాయికామారెడ్డి డిక్లరేషన్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ జీవో ఎం.ఎస్. నెంబర్ 9ని జారీ చేసింది. అయితే, ఈ జీవో అమలుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో, ఇప్పుడు ఆ పార్టీ ముందున్న చట్టపరమైన, రాజకీయపరమైన 'బిగ్ త్రీ' ఆప్షన్స్ ఇవే:

ఆప్షన్ 1: సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే ఎత్తివేయించడంహైకోర్టు జీవో నెంబర్ 9పై విధించిన స్టేను సుప్రీంకోర్టులో సవాల్ చేయడం ప్రభుత్వానికి ఉన్న తొలి ఆప్షన్. దీనిపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసి, విచారణకు వచ్చేలా చూడటం. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ట్రిపుల్ టెస్ట్ ప్రక్రియను రిజర్వేషన్లు పెంపు సందర్భంగా పాటించినట్లు చట్టపరంగా నిరూపించాల్సి ఉంటుంది. ఇందుకుగాను, బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల గణన సర్వే, బీసీ కమిషన్ ఏర్పాటు, ఆ కమిషన్ చేసిన అధ్యయనం, సిఫారసులను సుప్రీంకోర్టు ముందు ఉంచడం ద్వారా, తమకు అనుకూలంగా అంటే జీవో నెంబర్ 9పై స్టేను ఎత్తివేసేలా చేయడం మొదటి ఆప్షన్గా చెప్పవచ్చు.ఆప్షన్ 2: పాత రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించడంహైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు త్వరగా నిర్వహించాలనుకుంటే, పాత రిజర్వేషన్లనే అమలు చేస్తూ ఎన్నికల ప్రక్రియలో ముందుకు సాగడం రెండో ఆప్షన్. లేదా ప్రభుత్వం దీనిపై సుప్రీంలో పిటిషన్ వేయకపోయినా, ఒకవేళ పిటిషన్ వేసినప్పటికీ జీవో నెంబర్ 9పై స్టే ఎత్తివేయకపోతే ఉన్న మరో ఆప్షన్... 42 శాతం రిజర్వేషన్లు బదులు, పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించడం. అప్పుడు ఈ రిజర్వేషన్లు సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంటే 50 శాతం లోపు ఉండటం వల్ల లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. దీనివల్ల హైకోర్టు తీర్పుకు కట్టుబడి ఉండటమే కాకుండా, కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు నిధులు అందే అవకాశం ఉంది. అయితే, ఈ ఆప్షన్ ప్రకరం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే, ప్రతిపక్షాలు, బీసీ సంఘాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంది.ఆప్షన్ 3: గవర్నర్ ఆమోదం, చట్ట సవరణపై దృష్టి పెట్టడంగవర్నర్ ఆమోదం లేకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు జీవో నెంబర్ 9ను జారీ చేయడంపై హైకోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ఈ జీవోకు చట్టబద్ధ సవరణ చేయడం మరో ఆప్షన్ గా చెప్పవచ్చు. అంటే, బీసీ రిజర్వేషన్ల పెంపునకు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును గవర్నర్ ద్వారా ఆమోదింపజేయడం, హైకోర్టు లేవనెత్తిన సాంకేతిక అంశాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం ఈ ఆప్షన్లో భాగంగా చెప్పవచ్చు. జీవో ద్వారా కాకుండా శాసనసభ చేసిన చట్టం ద్వారా రిజర్వేషన్లు కల్పిస్తే చట్టపరమైన రక్షణ ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కొంత సమయం పట్టినా, ఈ ప్రక్రియ ద్వారా అనుకున్న రీతిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రయత్నించడం సరైన ప్రక్రియ. అయితే, చట్టసభలో ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడం అన్నది తెలంగాణ సర్కార్ చేతుల్లో లేని పని. ఈ ఆప్షన్ ఎంతవరకు సక్సెస్ అవుతుందనడం మాత్రం సందేహాస్పదమే.అయితే, ఈ మూడు ఆప్షన్స్ కూడా సుళువుగా ఎంచుకుని అమలు చేసే పరిస్థితి అయితే లేదు. కాకపోతే, సుప్రీంకోర్టు తలుపు తట్టే అవకాశాలు మాత్రం మెండుగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అన్నది కాంగ్రెస్ సర్కార్కు కేవలం చట్టపరమైన సవాల్ మాత్రమే కాదు. కామారెడ్డి డిక్లరేషన్ను అమలు చేయడం, బీసీల పట్ల తమ చిత్తశుద్ధి ప్రదర్శనకు కీలకం. బీసీ వర్గాల మద్దతు నిలుపుకోవడం ప్రధానం. అయితే, ప్రభుత్వం ఏ ఆప్షన్ ఎన్నుకుంటుంది, 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు ఎలా నిర్వహిస్తుందన్నది మాత్రం తెలియాలంటే వేచి చూడాల్సిందే.

# పొగాకు కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

**ఒంగోలు (లక్ష్యం న్యూస్)**

ప్రకాశం జిల్లా సింగరాయకొండ లోని బెల్లం కోటయ్య ప్రైవేటు పొగాకు లిమిటెడ్ లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గురువారం అర్ధరాత్రి తర్వాత ఆగస్మాత్తుగా కంపెనీలో మంటలు చెలరేగి భారీగా ఆస్తి నష్టం జరిగింది. ప్రస్తుతం శుక్రవారం తెల్లవారుజామున కూడా అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేస్తున్నారు. అయితే కంపెనీకి భారీగా కోట్లల్లో ఆర్థిక నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అగ్ని ప్రమాదం ఎలా జరిగింది? ఎంత మొత్తంలో ఆర్థిక నష్టం వాటిల్లింది అనే విషయం తెలియాల్సి వుంది.

# సంక్రాంతి నాటికి డీఎస్సీ...



**విజయవాడ, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరో గుడ్ న్యూస్ చెప్పారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, కళాశాల విద్య ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన డీఎస్సీ జనవరిలో నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా డీఎస్సీ, టెట్ ఉంటాయని పునరుద్ఘాటించారు. ప్రతిఏటా డిఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని మంత్రి నారా లోకేష్ మరోసారి ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్ చివరి వారంలో టెట్, 2026 జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్, మార్చిలో డిఎస్సీ నిర్వహించి, టీచర్ పోస్టులను భర్తీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టెట్, డిఎస్సీలకు అభ్యర్థులంతా సన్నద్ధం కావాలి సూచించారు. కొత్త డిఎస్సీ నిర్వహణ తర్వాత వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా ప్రణాళిక అమలు చేస్తామన్నారు లోకేష్. 2026 జనవరిలో నోటిఫికేషన్, మార్చిలో డిఎస్సీ, స్పెషల్ డిఎస్సీ నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలపై లక్ష్యసాధనకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. బేస్ లైన్ టెస్ట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 78మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను మెరుగైన విద్యాప్రమాణాలపై అధ్యయనానికి సింగపూర్ పర్యటనకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికే ఈ ఏడాది ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్త రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఏప్రిల్ 20న 16వేలకుపైగా పోస్టులతో తొలి నోటిఫికేషన్ ఇచ్చింది. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి రోజే డీఎస్సీ నియామక నోటిఫికేషన్ విడుదలకు సంబంధించి సంతకం చేశారు. కానీ రిజర్వేషన్ల అంశం ఇతర న్యాయ సమస్యలను పరిష్కరించుకొని ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వచ్చింది. ఏప్రిల్‌లో వచ్చిన నోటిఫికేషన్‌కు జూన్‌లో పరీక్షలు పెట్టారు. నెల రోజుల పాటు పరీక్షలు నిర్వహించారు. అక్కడికి నెల రోజుల తర్వాత ఫలితాలు విడుదల చేసి నియామక ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అమరావతిలో వేడుకగా కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలను కూడా అందజే?శారు. ఆ టైంలోనే ఏటా డీఎస్సీ ఉంటుందని నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ వేస్తున్నామని మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అన్నట్టుగానే అందుకు తగ్గ కార్యచరణ చేపట్టాలని అధికారులకు మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. మొన్న నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులు, ఇంకా వివిధ పాఠశాలల్లో ఉన్న ఖాళీల గుర్తించాల్సి ఉంది. ఈసారి భారీ స్థాయిలో పోస్టులు ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు.

## భారీగా పోలీసుల నియామకాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగులకు త్వరలోనే గుడ్‌న్యూస్ అందించే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్రంలో పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వు, ఏపీఎస్పీ, సీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో.. ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసు విభాగంలో ఖాళీల వివరాలకు సంబంధించిన లేఖను ఇప్పటికే డీజీపీ.. ప్రభుత్వానికి పంపించారు. ఆ వివరాలు పరిశీలించిన తర్వాత ప్రభుత్వం అనుమతి ఇస్తే.. పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి డీజీపీ కార్యాలయం పంపించిన లేఖలో ఖాళీల వివరాలను ప్రస్తావించింది. ఈ ఏడాది? ఆగస్టు 31వ తేదీ వరకు ఉన్న ఖాళీలని అందులో వెల్లడించారు. దాని ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలో.. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో 315 ఎస్సైలు, 3580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ, 2520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ఈ పోస్టుల నియామకాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. అయితే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయని ప్రభుత్వానికి రాసిన లేఖలో డీజీపీ పేర్కొ?న్నారు. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో నేరాలు పాల్పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పటిష్ఠం చేయాలంటే.. పోలీస్ ఫోర్స్ అవసరమని అన్నారు. అందుకోసం ఖాళీలను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా నిరుద్యోగుల గరిష్ఠ వయోపరిమితి పెంచింది. న్-యూనిఫాం సర్వీస్‌ల్లో పోస్టులకు.. గరిష్ఠ వయోపరిమితిని 34 నుంచి 42 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం.. ఇప్పుడు 42 ఏళ్ల వరకు కూడా ఈ ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు. యూనిఫాం పోస్టులకు రెండేళ్లు వయోపరిమితి పెంచింది. ఈ సడలింపు వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు వర్తించనున్నట్లు తెలిపింది. ఏపీపీఎస్సీ, ఇతర నియామక సంస్థల ద్వారా జరిగే నియామకాలకు ఇది వర్తిస్తుందని సర్కార్ పేర్కొంది. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి. అందులో ముఖ్యంగా, వయసు కారణంగా ఉగ్యోగాలు అనర్హులుగా ఉన్నవారు.. ఈ వయోపరిమితి పెంపుతో మళ్లీ దరఖాస్తు చేసుకో వచ్చు. అలాంటి వారికి ఇది ఒక గొప్ప అవకాశం అని చెప్పాలి.

# నవంబర్ నుంచి బంగారం తవ్వకాలు..



**కర్నూలు, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

రాయి రాయి అన్నది ఒకనాటికి రత్నమవునురా. బంగారం లాంటి ఈ మాట ఇప్పుడు రాయలసీమలో బంగారం ఉత్పత్తికి బాటలేసింది. ఇన్నాళ్లు నెర్రలు బాసిన నేలలో ఇప్పుడు ఇక కనకధారే. అవును.. కరువుకు కేరాఫ్‌గా నిలిచిన కర్నూలు సీమ ఇప్పుడు ఆత్మనిర్భర్ భారత్‌కు సిరుల సిగ కాబోతోంది. కర్నాటక గోల్డ్ ఫీల్డ్‌ను మించి తుగ్గలి మండలంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్‌లో భారీ మైనింగ్‌కు రంగం సిద్ధమైంది. దేశంలోనే మొట్ట మొదటి అతిపెద్ద ప్రవేటు గోల్డ్ మైన్‌గా కర్నూలు రికార్డు క్రియేట్ చేయబోతుంది. తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామంలో గోల్డ్ మైనింగ్ ప్రారంభిస్తున్నట్టు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. పసిడి ధరలు రికార్డు స్థాయిలో ఆకాశన్నంటుతున్న వేళ డెఫినెట్‌గా ఇది బంగారంలాంటి మాటే. స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు దేశంలో అతిపెద్ద ఫస్ట్ ప్రయివేటు గోల్డ్ మైన్ ఇదే. వానొస్తే కర్నూలు జిల్లా తుగ్గలి, పగిడిరాయి, తుగ్గలి, జొన్నగిరి సహా చుట్టుపక్కల గ్రామాల్లో వజ్రాలవేట జోరుగా సాగేది. అంతేకాదు నెర్రలు బాసిన ఈ నేలలో బంగారు నిక్షేపాలున్నాయని పరిశోధనల్లో తేలింది. అలా తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామం దగ్గర జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. బంగారం, వెండి వంటి ఖనిజాల వెలికితీతలో ఎంతో అనుభవం వున్న త్రివేణి త్రివేణి ఎర్త్ మూవర్స్, లాయ్‌లాడ్స్ మెటల్ అండ్ ఎనర్జీ లిమిటెడ్, దక్కన్ గోల్డ్ మైన్స్ భాగస్వామ్యంతో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ రాయలసీమలో సువర్ణ శకానికి తెరలేచింది. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 70 శాతంతో ప్రధాన వాటాదారులైన త్రివేణి సంస్థ ఎండీ ప్రభాకరన్ ? జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ త్వరలో మైనింగ్ చేపడుతామని ప్రకటించారు. ఏడాదికి 500 కేజీల ఉత్పత్తి లక్ష్యంగా త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఏటా టన్ను బంగారం ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్ధంచేసినట్టు చెప్పారాయన. భవిష్యత్తులో ఇక్కడ బంగారం ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత కొత్తగా నిర్మించిన ప్లాంట్‌లో ట్రయల్ రన్ కొనసాగుతుందన్నారు. భారత్ ఆత్మనిర్భర్ సంకల్పానికి జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ బాసటగా నిలుస్తుందన్నారు. బంగారం ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతగా పరిసర గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తామ ప్రాజెక్ట్ చేయూతనిస్తుందన్నారు ప్రభాకరన్. భూములిచ్చిన రైతు కుటుంబాలకు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

# వైసీపికి కొత్త వ్యూహకర్తలు

**విజయవాడ, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

2024 ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత, జగన్ ఇప్పుడు పూర్తిగా కొత్త దిశలో ఆలోచిస్తూ, పార్టీ పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారు. గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ, ప్రజల మధ్య తిరిగి విశ్వాసం పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ దిశగా ఆయన కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. తాజా సమాచారం ప్రకారం, జగన్ తన పార్టీకి కొత్త వ్యూహకర్తను నియమించే నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఐ-ప్యాక్ బృందంలో ప్రశాంత్ కిశోర్ తో కలిసి పనిచేసిన ఒక అనుభవజ్ఞుడు ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీకి కన్సల్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్నాడు. ఈ ఒప్పందం 2029 ఎన్నికల వరకు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. 2019లో ప్రశాంత్ కిశోర్ సూచనలతో భారీ విజయం సాధించిన జగన్, ఇప్పుడు అదే అనుభవాన్ని మరో వ్యూహకర్త ద్వారా వినియోగించుకోవాలని భావిస్తున్నారు. జగన్ దృష్టి ఇప్పుడు పూర్తిగా పార్టీ కేడర్ బలోపేతంపైనే ఉంది. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలతో ప్రత్యక్షంగా కలుసుకోవడం, నాయకుల మధ్య సమన్వయం పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కొత్త వ్యూహం కింద, ఆయన త్వరలో ప్రజల్లోకి వెళ్లే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలముందు ఎండగట్టే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పీపీపీవిధానంలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలనే నిర్ణయంపై జగన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు. ఇదే సమయంలో అధికార కూటమి కూడా తన వ్యూహాలను మరింత బలంగా మలుచుకుంటోంది. ప్రశాంత్ కిశోర్, రాబిన్ శర్మ వంటి వ్యూహకర్తలు టీడీపీ?జనసేన?బీజేపీ కూటమికి మార్గనిర్దేశం చేస్తున్నట్లు



సమాచారం. దీంతో జగన్ కొత్త వ్యూహకర్త, కూటమి వ్యూహకర్తల మధ్య ఆలోచనా పోరు ఆసక్తికరంగా మారనుంది. ఈ చర్యలన్నీ 2029 సార్వత్రిక ఎన్నికల దిశగా జగన్ తీసుకుంటున్న సన్నాహక క్రమంలో భాగంగా కనిపిస్తున్నాయి. పార్టీ పునరుత్థానం కోసం తీసుకుంటున్న ఈ వ్యూహాత్మక అడుగులు విజయవంతమైతే, రాష్ట్ర రాజకీయ సమీకరణాల్లో పెద్ద మార్పులు చోటుచేసుకోవచ్చు. ప్రజల్లో తిరిగి పట్టు సాధించడం, వైఎస్ఆర్‌సీపీకి నూతన ఉత్సాహాన్ని నింపడం జగన్ ప్రధాన లక్ష్యం. రాబోయే నెలల్లో ఆయన నిర్ణయాలు, కొత్త వ్యూహకర్త సూచనలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చలకు దారి తీసే అవకాశం ఉంది. మరో వైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోంది. రుషిరాజ్ సింగ్ నేతృత్వంలోని ఈ బృందం వైసీపీకి ఎన్నికల వ్యూహాన్ని.. రాజకీయ సలహాలను అందిస్తూ వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. దాని వెనుక ఐప్యాక్ టీం ఫెయిల్యూర్ ఉన్నట్లు సొంత పార్టీ నేతలే ఆరోపణలు చేశారు. దీంతో జగన్మోహన్ రెడ్డి ఐప్యాక్ టీం కు గుడ్ బై చెబుతారని ప్రచారం నడిచింది. కానీ ఇప్పటికీ ఐ ప్యాక్ టీం సేవలే కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే తాజాగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఐప్యాక్ బృందం నాయకత్వం మారనున్నట్లు ప్రచారం సాగుతోంది. రిషి రాజ్ సింగ్ స్థానంలో ప్రశాంత్ కిషోర్ ప్రధాన సన్నిహితుడు రానున్నట్లు టాక్ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో ప్రశాంత్ కిషోర్ కు విడదీయరాని బంధం. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు ముంగిట వరకు వచ్చి ఆగిపోయింది. 67 సీట్లతో సరిపెట్టుకుంది. ఈ తరుణంలో జగన్మోహన్ రెడ్డి ఎన్నికల వ్యూహకర్త కోసం అన్వేషించారు. ఎన్నికల వ్యూహంలో ఆరితేరిన ప్రశాంత్ కిషోర్ ను వ్యూహకర్తగా పెట్టుకున్నారు. 2018లో పాదయాత్ర సమయంలోనే పార్టీ శ్రేణులకు స్వయంగా పరిచయం చేశారు ప్రశాంత్ కిషోర్ ను జగన్మోహన్ రెడ్డి. అది మొదలు 2019 ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించే వరకు వారి జర్నీ కొనసాగింది. కానీ అకస్మాత్తుగా ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయవేత్తగా మారిపోయారు ప్రశాంత్ కిషోర్. అయినా సరే 2024 ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికి గౌరవ సలహాలు, సూచనలు అందించారు ప్రశాంత్ కిషోర్. ప్రస్తుతం బీహార్ రాజకీయాల్లో బిజీగా ఉన్నారు ప్రశాంత్ కిషోర్. మొన్న ఆ మధ్యన మంత్రి నారా లోకేష్ ఢిల్లీ వెళ్ళినప్పుడు ప్రశాంత్ కిషోర్ తో చర్చించారు. పలు అంశాలపై వారిద్దరూ మాట్లాడుకున్నారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో ఇబ్బందుల్లో ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రశాంత్ కిషోర్ ను ఆశ్రయిస్తే.. తాను రాజకీయాల్లో బిజీగా ఉన్నానని.. తరువాత చూద్దామంటూ దాటవేత ధోరణి చూపించినట్లు తెలుస్తోంది. అయితే రుషిరాజ్ సింగ్ స్థానంలో ప్రశాంత్ కిషోర్ వేరే వ్యక్తి పేరును సూచించినట్లు సమాచారం. త్వరలో ఆయన ఐప్యాక్ బృందానికి సారథ్యం వహిస్తారని కూడా ప్రచారం నడుస్తోంది. దీనిపై త్వరలో క్లారిటీ రానున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# తలనొప్పిగా మారుతున్న తమ్ముళ్ల తన్నులాటలు

?

**అనంతపురం, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

ఉమ్మడి అనంతపురం జిల్లా లోని కొన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. అధికార పార్టీ అయినప్పటికీ నాయకుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ధర్మవరం , రాప్తాడు వంటి నియోజకవర్గాల్లో పార్టీ లోపలకే సమస్యలు ఏర్పడుతున్నాయి. అయితే ఇప్పటివరకు వీరి మధ్య అనుకున్నంత పెద్దగా సవాళ్లు కనిపించవు. తాజాగా రాయదుర్గం నియోజకవర్గంలో కాల్వ శ్రీనివాసులు పై పార్టీ లోపల విమర్శలు వినిపించాయి. శ్రీనివాసులు సీనియర్ నేత, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్నారు. తన రాజకీయ చరిత్రలో సౌమ్యుడనే పేరు తెచ్చుకున్నాడు, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారు. తన సామాజిక వర్గానికి మాత్రమే కాకుండా, అన్ని వర్గాల వారిని కలుపుతూ ముందుకు వెళ్తూ అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. కానీ, ఇటీవల ఆయనపై సొంత పార్టీలో కొన్ని విమర్శలు వచ్చాయి. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో పాత ఘర్షణలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అధికారపక్షం లోపలే విభేదాలు పెరుగుతున్నాయి.. ఇది స్థానిక రాజకీయ వాతావరణంలో టిడిపి నాయకులకు సవాలు గా మారింది. ఇక ఈ లక్షలు మరీ ఎక్కువ కావడంతో లోకల్ గా కూడా "ఎంతకాలం ఈ గొడవలు?" అనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ నాయకులు, ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విషయంలో టిడిపి అనుసరిస్తున్న విధానాలపై ప్రజలు కాస్త తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు. రాజకీయంగా కేవలం దూకుడే ఫలితాన్ని ఇవ్వదు. స్థానిక పరిస్థితులు, ప్రజల ఆలోచనలు, సమాజ మార్పులను అర్థం చేసుకుని నాయకులు సరైన వ్యూహాలను రూపొందించుకోవాలి. అలా కాకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఇక చంద్రబాబు నాయుడు ఈ సమస్యపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం కూడా వార్తల్లో వినిపిస్తోంది. కానీ, స్థానిక రాజకీయ దృష్ట్యా ఇది సరైన పరిణామం కాదని విశ్లేషకులు చెబుతున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలను సమర్థవంతంగా సర్దుమణిగే విధంగా ఆయన ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, స్థానిక స్థాయిలో సమైక్యత సాధించడానికి చర్యలు అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు. మొత్తానికి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నియోజకవర్గాల్లో నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, సవాళ్లను సానుకూలంగా పరిష్కరించే ప్రయత్నాలు ఇప్పటి వరకు లేకపోవడం రాజకీయ వర్గాల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. టిడిపి నాయకులు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకోవాలి అని రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

# బీజేపీలోకి పెద్దిరెడ్డి ఫ్యామిలీ?

**తిరుపతి, అక్టోబరు 10, (లక్ష్యం న్యూస్)**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన కుటుంబం గుడ్ బై చెబుతుందా? కమలం గూటికి చేరుతుందా? బిజెపిలో చేరాల్సిన అనివార్య పరిస్థితి ఎదురయిందా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇప్పుడు దీని పైనే చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగిన కుటుంబం ఇప్పుడు కేసుల్లో చిక్కుకుంది. వాటి నుంచి బయటపడాలంటే అధికార పార్టీలోకి వెళ్లడం ఒక్కటే మార్గం. ఆపై సొంత పార్టీ అధినేత నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించకపోవడంతో.. ఆ కుటుంబం బిజెపిలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఏపీలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. ఇంతకీ ఆ ఫ్యామిలీ ఏదంటే పెద్దిరెడ్డి. ఇటీవల పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జైలు నుంచి బయటకు వచ్చారు. అయితే అదే మిథున్ రెడ్డిని ఇప్పుడు కేంద్రం ఐక్యరాజ్యసమితి సమావేశాలకు పంపిస్తుండడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. కూటమి( అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దూకుడుగా వ్యవహరించిన నేతలకు కేసుల ఇబ్బందులు తప్పడం లేదు. చివరకు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలను చేసిన వారిని సైతం విడిచిపెట్టలేదు. ఈ పరిస్థితుల్లో రాయలసీమను తన ఆధీనంలో ఉంచుకొని పాలించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆయనపై రకరకాల కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు మద్యం కుంభకోణం కేసులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు.. మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. రెండు నెలల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఇటీవల ఆయనకు బెయిల్ లభించింది. అయితే పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి జైల్లో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి కనీసం పరామర్శించలేదు. బెయిల్ పై బయటకు వచ్చిన మిధున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు ఇష్టపడలేదు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో



వైసిపి ఓటమిపై పోస్టుమార్టం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది కానీ.. పెద్దిరెడ్డి కుటుంబం ఎలా గెలిచింది అన్నదానిపై జగన్మోహన్ రెడ్డి విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ సమయంలోనే టిడిపి తో పెద్దిరెడ్డి కుమ్మక్కయ్యారా? అన్న అనుమానాలు కూడా బయటపడ్డాయి. అటు తరువాత ఆ వివాదం ముగిసింది. అయితే అసెంబ్లీకి వైసిపి ఎమ్మెల్యేల హాజరు విషయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లీడ్ తీసుకోవాలని జగన్ సూచించారు. అందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒప్పుకోలేదు. అప్పటినుంచి జగన్లో అనుమానాలు మరింత పెరిగాయి అన్న ప్రచారం సాగుతోంది. ఐక్యరాజ్యసమితి సమావేశాలకు బిజెపి ఎంపీ పురందేశ్వరి నేతృత్వంలో అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులను ఎంపిక చేశారు. అయితే ఏపీ నుంచి ఆ బృందంలో వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కూడా ఉన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం నుంచి అభ్యంతరాలు వచ్చినా బిజెపి పెద్దలు మాత్రం మిధున్ రెడ్డిని ఎంపిక చేశారు. దీంతో పెద్దిరెడ్డి కుటుంబం బిజెపికి దగ్గర అయిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో పెద్దిరెడ్డి వైసీపీకి గుడ్ బై చెప్పరని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తుంటే మాత్రం పెద్దిరెడ్డి కుటుంబం కమలం గూటికి వెళ్లడం ఖాయం అని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి

# రాష్ట్రంలో 125 ఆర్టిజం సెంటర్స్



ఉపాధ్యాయుల వద్ద వివరాలు ఆడిగి తెలుసుకుంటున్న స్టేట్ అబసర్వేర్ మల్లికార్జున్.

**కర్లపాలెం అక్టోబర్ 10 లక్ష్యం న్యూస్.**

దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్టిజంతో బాధపడుతున్న వారికి ఉచిత విద్యను అందించేందుకు 125 సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు భవిత సెంటర్ల స్టేట్ అబ్జర్వర్ మల్లికార్జున్ అన్నారు. కర్లపాలెం ఇందిరానగర్ లోని ప్రత్యేక అవసరాలు కలిగిన భవిత సెంటర్ ను సందర్శించారు. పిల్లల పురోగతిని పరిశీలించారు. రికార్డులను తనిఖీలు నిర్వహించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పిల్లల హాజరు శాతంను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్ మాట్లాడుతూ కర్లపాలెం భవిత సెంటర్ లోని చిన్నారులు 67 మంది 6 వేలు చప్పున తల్లి అకౌంట్ లో నగదు జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య జిల్లా సమన్వయకర్త జ్యోస్నా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు నరాలశెట్టి లక్ష్మీ ప్రసన్న ,చందన, సుజాత తదితరులు పాల్గొన్నారు

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P. and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. R.N.I. No. APTEL/2013/48712 Editor : CHALLA MADHUSUDHANA RAO